
సూర్య
www.suryaa.com
ఆదివారం
29.12.2024



# భారతీయ సినిమా దార్శనికుడు రాజ్ కపూర్

## చైర్మన్‌తో ముఖాముఖి



నూకారపు సూర్యప్రకాశరావు
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

**ప్రతి దానికీ ఓ లెక్క ఉంటది. దానికి.. ఏదో ఒక దగ్గర ఎండ్ ఉంటది. కానీ.. ఈ దేశంలో కొన్ని రాజకీయ పార్టీలకు వస్తున్న డొనేషన్లకు మాత్రం లెక్క లేదు. అందుకే.. ఇండియాలో ఇప్పుడు డొనేషన్.. సెన్సేషన్గా మారింది. జస్ట్.. ఒక్క ఏడాదిలోనే బీజేపీకి వచ్చిన పార్టీ ఫండ్ 200 శాతానికి పైగా పెరిగిందంటే.. పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇది ఒక్క బీజేపీకే పరిమితం కాదు. మనం తెలుసుకోవాల్సిన లెక్కలు.. చాలానే ఉన్నాయి. అని నేనంటాను మీరేమంటారు?**

**– పట్నాన రాజశేఖర్, హైదరాబాద్**

అవును రాజశేఖర్ గారూ.. ఇవి జస్ట్ నెంబర్స్ కావు.! అక్షరాలా.. ఈ దేశంలో పాపులర్ పొలిటికల్ పార్టీలకు వచ్చిన విరాళాలు. ఇదంతా.. జస్ట్ ఒక్క ఏడాదిలోనే! వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ.. రాజకీయంగా పీక్ స్టేజ్లో ఉంది. ఆ పార్టీ పెర్ఫార్మెన్స్ కూడా అదే స్థాయిలో ఉంది. ఏ ఎన్నిక వచ్చినా.. సత్తా చాటుతోంది. కానీ.. ఇది జస్ట్ ఎలక్షన్లకే పరిమితం కాలేదు. ఆ పార్టీకి వస్తున్న విరాళాలు కూడా అదే స్థాయిలో ఉన్నాయ్. ఈ దేశంలోని మిగతా పొలిటికల్ పార్టీలతో పోలిస్తే.. బీజేపీకి విరాళాలు ఇస్తున్న వారి లిస్టు చాలా పెద్దది. అదే ఆ పార్టీకి విపరీతంగా విరాళాలు వచ్చేందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనే.. బీజేపీకి 2 వేల 244 కోట్ల విరాళాలు అందాయ్. ఈ నెంబర్ చాలు.. బీజేపీ విషయంలో ఎవరి లెక్కలు ఎలా ఉన్నాయో చెప్పడానికి! ఈ మధ్యకాలంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. బీజేపీ మంచి ఫలితాలనే సాధిస్తోంది. వరుస విజయాలతో సత్తా చాటుతున్న కమలం పార్టీకి.. మరోవైపు కాసుల వర్షం కురుస్తోంది. రోజురోజుకూ.. బీజేపీకి విరాళాలిచ్చే వారి సంఖ్య పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. పార్టీ ఫండ్స్ విషయంలో.. భారతీయ జనతా పార్టీ కంటే ముందూ మరే పార్టీ లేదు. గత ఏడాదిలో వ్యక్తులు, ట్రస్టులు, కార్పొరేట్ సంస్థల నుంచి ఎక్కువ మొత్తంలో బీజేపీకి డొనేషన్స్ అందాయి. 20 వేల రూపాయల కంటే తక్కువ ఏ ఒక్కరూ ఇవ్వలేదు. అలా.. మొత్తంగా 2 వేల 244 కోట్లు అందాయి. ఇది.. అంతకుముందు ఏడాది.. అంటే 2022-23లో వచ్చిన విరాళాల కంటే మూడు రెట్లు ఎక్కువ. దాంతో.. పార్టీ ఫండ్స్ విషయంలో బీజేపీనే అగ్రస్థానంలో కొనసాగుతోంది.

మరోవైపు.. గత ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్కు కూడా భారీగానే విరాళాలు అందాయి. 2023-24లో 289 కోట్ల పార్టీ ఫండ్ అందింది. అంతకుముందు సంవత్సరం కాంగ్రెస్కు 80 కోట్లు పార్టీ ఫండ్ వచ్చింది. దాంతో పోలిస్తే.. కాంగ్రెస్కు కూడా భారీగా పార్టీ ఫండ్ అందిందనే చెప్పాలి. అయితే.. బీజేపీ, కాంగ్రెస్ ప్రకటించిన మొత్తం విరాళాల్లో.. ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన డొనేషన్ల వివరాలు లేవు. ఎందుకంటే.. ఆ వివరాల్ని రాజకీయ పార్టీలు కేవలం ఆడిట్ రిపోర్టుల్లో మాత్రమే ప్రకటించాల్సి ఉంటుంది. ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని సుప్రీంకోర్టు కూడా కొట్టివేసింది. కాబట్టి.. రాజకీయ పార్టీలకు వచ్చే విరాళాలు.. నేరుగానైనా రావాలి. లేనిపక్షంలో ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా నైనా రావాలి.

అయితే.. కొన్ని ప్రాంతీయ పార్టీలు మాత్రం 2023-24 కాంట్రిబ్యూషన్ రిపోర్టులో.. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా స్వీకరించిన విరాళాల్ని కూడా స్వచ్ఛందంగా వెల్లడించాయి. అందులో.. బాండ్ల ద్వారా దాదాపు 496 కోట్లు పొందిన బీఆర్ఎస్ కూడా ఉంది. అదేవిధంగా.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దాదాపు 122 కోట్లు, డీఎంకే 60 కోట్లు పొందాయి. ఇక.. జేఎంఎం పార్టీ బాండ్ల ద్వారా పదకొండున్నర కోట్లు అందుకున్నట్లు ప్రకటించింది. ఇతర మార్గాల్లో.. ఆ పార్టీకి కేవలం 64 లక్షల రూపాయల విరాళాలు మాత్రమే అందాయి. 2022-23 సంవత్సరంతో పోలిస్తే.. గత ఆర్థిక సంవత్సరంలో బీజేపీకి అందిన పార్టీ ఫండ్ 212 శాతం పెరిగింది. ఎందుకంటే.. ఇది ఎన్నికల సంవత్సరం కాబట్టి.. ఆ స్థాయిలో విరాళాలు వచ్చి ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. అయితే 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు సంవత్సరం.. బీజేపీ 742 కోట్లు, కాంగ్రెస్ దాదాపు 147 కోట్లు తమకు విరాళాలు ద్వారా అందినట్లు ప్రకటించాయి. అప్పటితో పోలిస్తే.. రెండు పార్టీలకు పార్టీ ఫండ్స్ భారీ స్థాయిలో పెరిగినట్లు అర్థమవుతోంది. ఇటీవలి కాలంలో ఎలక్టోరల్ ట్రస్ట్ రూట్ ద్వారా బీజేపీకి 850 కోట్లు వచ్చాయి. అందులో 723 కోట్లకు పైగా ప్రుడెంట్ నుంచి, 127 కోట్లు ట్రయాంఫ్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి, 17 లక్షల రూపాయలు ఎన్జిగార్టింగ్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి వచ్చాయి. కాంగ్రెస్కు కూడా ఎలక్టోరల్ ట్రస్ట్ రూట్లో.. ప్రుడెంట్ నుంచి 156 కోట్లకు పైగా విరాళం అందుకుంది. ఎన్నికల సంఘం వెబ్సైట్లో అందుబాటులో ఉన్న రిపోర్ట్ ప్రకారం.. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి బీజేపీకి 723 కోట్లకు పైగా పార్టీ ఫండ్స్ వచ్చాయ్. అదే ట్రస్ట్ నుంచి కాంగ్రెస్కు.. 156 కోట్లకు పైగా విరాళాలు అందాయి. ఈ లెక్కన.. 2023-24 సంవత్సరంలో బీజేపీకి వచ్చిన విరాళాల్లో.. మూడింట ఒక వంతు కాంగ్రెస్ అందుకున్న విరాళాల్లో.. సగానికి పైగా ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచే వచ్చాయి. దీని వెనుక బడా కంపెనీలున్నాయనే చర్చ నడుస్తోంది. పదులు, వందల కోట్లలో పార్టీలకు అందుతున్న విరాళాలకు సంబంధించి.. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన మేజర్ పాయింట్ ఒకటుంది. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ మాత్రమే దాతగా ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ కూడా ట్రస్టుల ద్వారా 156 కోట్లకు పైగా విరాళాలు అందుకుంది. ఇదే ట్రస్ట్ ద్వారా బీఆర్ఎస్కు 85 కోట్లు, వైసీపీకి 62 కోట్లకు పైగా విరాళాలు అందాయి. అయితే ఈ రెండు పార్టీలు.. కొద్ది నెలల గ్యాప్లోనే అధికారానికి దూరమయ్యాయి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్లో ఉన్న అధికార తెలుగుదేశం పార్టీకి కూడా ఈ ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా 33 కోట్ల ఫండ్ అందింది.

ఇక.. ట్రయాంఫ్ ఎలక్టోరల్ ట్రస్ట్, జై భారత్ ట్రస్ట్ నుంచి.. తమిళనాడు పార్టీ డీఎంకేకు 8 కోట్ల విరాళాలు అందాయి. ఇక్కడ ఇంట్రస్టింగ్ పాయింట్ మరొకటుంది. లాటరీ కింగ్ ఆఫ్ ఇండియాగా పేరున్న శాంటియాగో మార్టిన్ కంపెనీ కూడా బీజేపీకి విరాళం ఇచ్చింది. ఫ్యూచర్ గేమింగ్ అండ్ హొటల్ సర్వీసెస్ నుంచి 3 కోట్ల రూపాయల ఫండ్ ఇచ్చారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఫ్యూచర్ గేమింగ్ సంస్థ.. అతిపెద్ద దాతగా ఉంది. ఈ కంపెనీ ద్వారా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా లాభపడింది.

## లెజెండ్

# సినీ సరస్వతీ ప్రియ పుత్రుడు...పింగళి నాగేంద్రుడు



పింగళి నాగేంద్రరావు ... తెలుగు సినిమా రంగంతో విడదీయరాని బంధం, సంబంధం అనుబంధం ఉన్న గొప్ప రచయిత. తెలుగు సినిమా రచయిత మాత్రమే కాదు. పాత్రికేయుడు, నాటక రచయిత కూడా. కృష్ణా పత్రిక, శారద పత్రికల్లో ఆయన ఉపసంపాదకుడుగా పనిచేసాడు. వింధ్య రాణి, నా రాజు, జేబున్నీసా, మేవాడు రాజ్య పతనం, క్షాత్ర హిందు, నా కుటుంబం, గమ్మత్తు చావు తదితర నాటకాలు ఆయన రాసినవే. అయన ఒక రచయితగా తెలుగు సినీ రంగానికి చేసిన సేవ మరిచి పోలేనిది. సినిమా సంభాషణలలో కొత్త హాస్య పదాలు సినిమాలలో కొత్త పాత్రలు సృష్టించి మరెన్నో ప్రయోగాలు చేసి సినీ సాహిత్య స్వరూపాన్ని మార్చివేసిన సినీ సరస్వతీ పుత్రుడు. జానపదమైనా, పౌరాణికమైనా, సాంఘికమైనా జానపదులు సైతం మెచ్చే సరళభాషను ఉపయోగించిన సినీ ఆదికవి. "సాహసం శాయరా డింభకా", "చూపులు కలిసిన శుభవేళ", "లాహిరి లాహిరి లాహిరిలో", "అహ నా పెళ్ళంట" వంటి సినిమాల పేర్లు పింగళి పాటల్లోనుంచి తీసుకున్నవే. 1939లో తీసిన గుణ సుందరి సినిమాలో పింగళి రాసిన 'శ్రీతులసి ప్రియతులసి జయమునీయవే' పాట నేటికీ మంగళ హారతి గా పాడుకోవడం వింటూనే ఉన్నాం.

పింగళి నాగేంద్రరావు 29 డిసెంబరు 1901న శ్రీకాకుళం జిల్లా రాజాం పట్టణంలో జన్మించాడు. నాగేంద్రరావు తండ్రి గోపాలకృష్ణయ్య, తల్లి మహాలక్ష్మమ్మ. పింగళి బాల్యం, విద్యాభ్యాసం మచిలీపట్నంలోనే జరిగింది. పింగళి చిన్నతనంలోనే సాహిత్యంతోబాటు వృత్తి విద్యలను కూడా అధ్యయనం చేశారు. పింగళి లోని సాహిత్య పిపాసను గమనించిన భోగరాజు పట్టాభి సీతారామయ్య, మట్నూరి కృష్ణారావు పింగళిని ప్రోత్సహించారు. 1917లో పింగళి మెకానికల్ ఇంజనీరింగ్ లో డిప్లొమా తీసుకున్నాడు. తరవాత మచిలీపట్నంలోనే కొంతకాలం ఉపాధ్యాయునిగా పనిచేశాడు. 1918లో ఖరగ్పూర్ రైల్వే వర్క్ షాపులో అప్రంటీసుగా చేరాడు. ప్రముఖ యోగా గురువు బులుసు రామజోగారావు ఉపన్యాసాలకు ప్రభావితుడై 1920లో రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసి పింగళి జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నా డు. ఆయన దివ్యజ్ఞాన సమాజం (థియోసాఫికల్ సొసైటీ) సభ్యుడిగా నమోదై ఉత్తర భారత దేశ మంతా పర్యటించి సబర్మతీ ఆశ్రమంలోచేరి బ్రహ్మచర్యం పాటించాలని నిర్ణయించుకుని జీవితాంతం బ్రహ్మచారిగా వుండిపోయాడు.


కొంతకాలం కృష్ణాజిల్లా కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరించాడు. అప్పుడే 'జన్మభూమి' అనే దేశభక్తి పద్యకావ్యాన్ని రచించారు. ఫలితంగా బ్రిటీష్ ప్రభుత్వాధికారులకు ఆగ్రహానికి గురై, పింగళి జైలు పాలు కావాల్సి వచ్చింది. విడుదలయ్యాక పట్టాభి సీతారామయ్య సలహా మేరకు 1923లో 'శారద' అనే పత్రికకు సహసంపాదకుడుగా చేరి తన సాహిత్య రచనా వ్యాసంగం మీద దృష్టి సారించాడు. అదే సమయంలో బెంగాలి నాటకకర్త డి.ఎల్.రాయ్ రచించిన 'మేవార్ పతన్', 'పాషాణి' నాటకాలను తెలుగులోకి అనువదించాడు. అనువాద నాటకాలు కృష్ణాపత్రికలో ధారావాహికలుగా వెలువడ్డాయి. అదే స్ఫూర్తితో 'జేబున్నీసా', 'వింధ్యరాణి', 'నారాజు', 'క్షాత్రహిందూ', 'ఒకే కుటుం బం' వంటి నాటకాలను రాసి నాటక రచయితగా మంచి పేరు సంపాదిం చాడు. వాటిలో 'ఒకే కుటుంబం' నాటక రచనకు 1939లో నవ్యసాహితి సమితి సంస్థ ఉత్తమ నాటక రచనా బహుమతిని ప్రదానం చేసింది. విజయా సంస్థకు ఇరవై సంవత్సరాల సుదీర్ఘకాలం ఆస్థాన కవిగా భాసిల్లిన సాహిత్య వేత్త పింగళి. 1955 లో మిస్సమ్మలో లీల పాడిన రావోయి చందమామ మా వింత గాథ వినుమా, ఏమిటో ఈ మాయ ఓ చల్లని రాజా వెన్నెల రాజా అనే పాటలు ఇప్పటికీ బహుళ వ్యాప్తంగా ఉన్నాయి. మిస్సమ్మ పాత్రకోసం పింగళి ఆత్మాభిమానం, పెంకితనం, తలబిరుసుతనంతో కూడిన సంభాషణలు రచిం చాడు. పాండవుల వేషాలకు తగిన వారు దొరక లేదని, పాండవుల ప్రస్తావన అడుగడునా వస్తూనేవున్నా వారు తెరమీద కనపడకుండా పింగళి చిత్రకథను రూపొందించి హిట్ చేసిన పౌరాణిక సినిమా 'మాయాబజార్'. భారతీయ సినీ స్వర్ణోత్సవం సందర్భంగా సి ఎన్ ఎన్, ఐ బి ఎన్ సంస్థ వంద ఆల్ టైం గ్రేట్ భారతీయ సినిమాల గుర్తింపుకోసం సర్వే నిర్వహిస్తే, మాయాబజార్ సినిమా ప్రథమ స్థానంలో నిలిచింది. ఘటోత్కచ రాక్షస గణం లోని గురువు పేరును చినమయ అని నామకరణం చేశాడు. పింగళి... "మాయ" తెలుగు పదానికి 'బజార్' అనే ఉర్దూ పదం చేర్చి పౌరాణిక చిత్రానికి మకుటంగా పెట్టడం, ఎక్కడా 'బజార్' అనే పదాన్ని చిత్రంలో రానీయకుండా జాగ్రత్తపడడం పింగళి రచనా సామర్థ్యానికి ఉదాహరణ. ఈ సినిమా అద్భుత విజయాలను నమోదు చేసిన విషయం అవగతమే. ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో యేకకాలంలో నిర్మించిన సంగతి కూడా తెలిసిందే.

ఈ సినిమాలో సత్యపీఠం, ప్రియదర్శిని, తస్మదీయులు, దుష్టచతుష్టయము, జియ్యా, వీరతాళ్ళు, రత్నగింబళి, గిల్పం, శాకంబరీ దేవి ప్రసాదం వంటి కొత్త పదాలను పింగళి ప్రవేశపెట్టాడు. 'ఎవరూ కనిపెట్టకుండా మాటలెలా పుడతాయి' అంటుండే వారు. 'రసపట్టులో తర్కం కూడదు', 'భలే మామా భలే', 'ఇదే మన తక్షణ కర్తవ్యము' వంటి మాటల్ని కూడా ప్రయోగాత్మకంగా వాడగా, నేటికీ అవి వాడుకలో వుండటం విశేషం..1958లో పింగళి నాగేంద్రరావు జయంతి సంస్థ కె.వి.రెడ్డి దర్శకత్వంలో నిర్మించిన 'పెళ్లినాటి ప్రమాణాలు' చిత్రానికి, 1960 లో సారణీ వారి 'మహాకవి కాళిదాసు' సినిమాకి కథ, మాటలు, పాటలు సమకూర్చారు. 1959లో విజయావారి 'అప్పుచేసి పప్పుకూడు' సాంఘిక కామెడీ చిత్రానికి పాటలు మాత్రం రాశారు. 'మహాకవి కాళిదాసు' చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రంగా రజత పతాకాన్ని పొందింది. తమిళంలోని 'జగదల్ ప్రతాపన్' చిత్రాన్ని స్ఫూర్తిగా తీసుకొని విజయా సంస్థ 1961లో 'జగదేకవీరుని కథ' అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ చిత్రంలో పౌరాణిక అంశాలను మేళవిస్తూ పింగళి ఈ చిత్రానికి నవరస భరితంగా రచన చేశారు..1962లోనే బి.ఎస్. రంగా నిర్మించిన 'మహామంత్రి తిమ్మరుసు' చిత్రానికి కథ, మాటలు పాటలు పింగళి సమకూర్చారు. ఈ చిత్రానికి జాతీయ స్థాయిలో రాష్ట్రపతి రజత పతకం దక్కింది. గుమ్మడి చలనచిత్ర జీవితంలో ఈ చిత్రం ఒక కలికి తురాయి. 1963లో కె.వి.రెడ్డి జయంతి పిక్చర్స్ బ్యానర్ మీద 'శ్రీకృష్ణార్జున యుద్ధం' చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు పింగళి సమకూర్చాడు. అర్జునుడు వేసే వేషానికి సరదాగా 'అజిభీదఫపా స్వాములు' అని అర్జునుని వివిధ నామాలను గుర్తుచేస్తూ పేరు పెట్టాడు పింగళి.

'సి.ఐ.డి' (1965), రాజకోట రహస్యం' (1971) చిత్రానికి, 'శ్రీకృష్ణసత్య' (1971) చిత్రానికి పింగళి మాటలు, పాటలు సమకూర్చారు. ఎన్ టి ఆర్ 1977లో నిర్మించిన 'చాణక్య చంద్రగుప్త' సినిమాకు చివరి సారిగా పింగళి కథ, మాటలు సమకూర్చాడు. పింగళి నాగేంద్రరావు 1971 మే 6న కన్నుమూశాడు.

## నవ కవిత్వం

### పాత బట్టల దుక్నం



ఆకలి జీవులకు అంగడి నాడు
ఓ మూలకు ఊరికి దూరమున్నట్టు
గుడ్డి వెలుగుల గడ్డు జీవులకు
రంగులెలిసిన పాత బట్టలు
ఆలు బిడ్డల అంగి రైకలకై
అంగడొచ్చిన అల్పజీవికి
సరుకు సౌధల లెక్క తేలిక
చింపిరి నెత్తి గోకి గోకి
అగ్గువ సగ్గువ అడ్డగుడ్డలను
అడ్డికి పావు సేరు ధరలకడిగి
చిల్లుబడ్డ జేబుల చిల్లర చూసుకుని
బేరం కుదరక బేల చూపుచూస్తూ
చిరగని చీరలకై ఒకరు
చిరిగిన జీన్స్ కై మరొకడు
మంచిదాని కోసమై లెంకెటోళ్లు
ఊరికే మడత బట్టలన్నీ
మల్లెసేటోళ్లు
పటాటోప ప్రచారము లేదు
మీరుమిట్లు గోలిపే మధ్యాహ్నపు
లైట్లులేవు
ప్రమాదకరమైన ప్రైస్ ట్యాగ్లేవు
షరతులు వర్తించే తగ్గింపులు లేవు
అయినా.....! అంగడి నాడు
అమ్మలేక అతడు! కొనలేక ఇతడు!
పాత బట్టల దుక్నం కాడ
విచారంగా విచిత్ర దృశ్యం
ఆకలి తీరే దారి కోసం
మల్లంగడికై ఎదురుచూపులు..?


**డా. ఎడ్ల కల్లేశ్**
**9866765126**

## లేఖలు

**ముఖచిత్ర కథనం యువతలో ఇటీవల కాలంలో పెరిగిన బ్రెయిన్‌స్ట్రోక్ గురించి విపులాత్మక వ్యాసం ప్రచురించిన మీకు కృజ్ఞతలు. రచయితకు ప్రత్యేక ధన్యవాదాలు**

ప్రత్యేక కథనాన్ని ఆదివారం అనుబంధంలో ప్రచురించడం బాగుంది. అన్ని పత్రికలకు విభిన్నంగా భిన్న అంశాలను ముఖపత్ర కథనాలుగా ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని కథనాలు ప్రచురించాలని కోరుతున్నాము. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**




**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరం దిస్తున్న ప్రోత్సాహం బాగుంది. . రచిత కథనాన్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు


**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**


## కాలచక్రం లో.....





కాలచక్రంలో...
సంవత్సరాలు వస్తుంటాయి
పోతుంటాయి
క్యాలెండర్ లోని వారాలు తిధులు
అంకెలు మారుతుంటాయి
మనిషి చేసిన కార్యాలు
మిగులుతుంటాయి
పాత జ్ఞాపకాలు నిలుస్తాయి
కొత్త ఆశలు చిగురుస్తాయి
భిన్న దృవాలు విభిన్న వ్యక్తులు
విచిత్ర మనస్తత్వాలు
కలిసిన ప్రయాణాలు
చేదు అనుభవాలు తీపి జ్ఞాపకాలు
కలిసి పోవడాలు
విడిపోవడాలుజి
కొందరికి మోదాలు
ఇంకొందరికి ఖేధాలు
ఆనందాలు
దుఃఖాలు
కొందరికి ఆమోగ్యాలు
మరికొందరికి పండు వెన్నెలలు
ఎత్తు పల్లాలు
వొంపు లోయలు
అవమానాలు అనుమానాలు
చిత్కరాలు సత్కారాలు
ఇవన్నీ నుదిటినుంచుకొని
కాలాన్ని నిందిస్తే ఎట్లా?
మృత్యువును చేరుకోవడంలో
ఎప్పుడు ఎవరి వంతు వస్తుందో
తెల్వదు
గడియ దాటితే ఏమి
జరుగునో ఎవరం ఊహించగలం
కలిసుందామని
ఎంత తాపత్రయపడినా
ఎన్నటికీ కుదరకపోవచ్చు
జీవితమంటే....
పబ్బులు క్లబ్బులు
తాగుడు వాగుడు మాత్రమే కాదు
ఒంటరిగా ఉండడం
టీవీలకు సెల్ ఫోన్లకు
హత్తుకోవడం అసలే కాదు
జీవితమంటే
తోబుట్టువులతో
అమ్మ నాన్నతో ఆనందంగా
గడపడం
ఆశలు లక్ష్యాలతో
ముందుకు సాగడం

**– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి**
**9441561655**




సూర్య బుడత

బాలల కథ



# మార్పు తెచ్చిన రేఖ






ఆంధ్రప్రదేశ్ లోని హరిశ్చంద్రపురం గ్రామంలో సూర్యనారాయణ క్రమశిక్షణతో కష్టపడి పనిచేసేవాడు. తన తెలివి తేటలతో సరస్వతి అప్పర్ ప్రైమరీ స్కూల్లో ప్రధానోపధ్యాయ పదవి సంపాదించి, అదే గ్రామానికి చెందిన దూరపు బంధువైన యువతిని పెళ్ళి చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. కూతురు రత్న, కొడుకు ప్రమోద్. ఇద్దరిని క్రమశిక్షణతో పెంచడంవల్ల చదువులో మంచి తెలివితేటలు ప్రదర్శించేవారు. అమ్మాయి 6వ తరగతి, అబ్బాయి 5వ తరగతి అదే స్కూల్లో చదువుతున్నారు.


తదుపరి చదువు గురించి తల్లిదండ్రులకి ఆలోచనతోపాటు ఆందోళనకూడా కలిగింది. కారణం మాధ్యమిక పాఠశాల 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. అంతదూరం పిల్లల్ని పంపించడం వాళ్ళకిష్టం లేదు. అందుకని గ్రామస్తుల్ని కూడగట్టుకొని తమ గ్రామంలోనే ఉన్నత పాఠశాల నిర్మించాలని సూర్యనారాయణ స్థానిక ఎమ్మెల్యేకి ఒక వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించిడంతో ప్రభుత్వం వీరి అభ్యర్ధనను మన్నించి, పరిశీలించమని పాఠశాలల ఇన్స్పెక్టర్ కి బాధ్యత అప్పగించారు. విద్యార్థుల నైపుణ్యాన్ని, పాఠశాల పరిస్థితిని గమనించడానికి ఒకరోజు ఇన్స్పెక్టర్ రామనాధం ఆకస్మికంగా వచ్చాడు. 6వ తరగతికి వచ్చి వాళ్ళ తెలివితేటల్ని పరీక్షించడానికి బ్లాక్ బోర్డ్ మీద ఒక గీర గీసి " దీనిని చెరపకుండా ఎవరైనా చిన్నది చెయ్యగలరా" అని ప్రశ్నించాడు. అది అసాధ్యమని అందరూ అనుకుంటున్న తరుణంలో రత్న కొంతసేపు జాగ్రత్తగా ఆలోచించి బోర్డు దగ్గరకొచ్చి ఆ గీత పక్కన ఇంకొక పెద్ద గీత గీసింది. వెంటనే రామనాధం ఆమెని మెచ్చుకుంటూ ఆ పాఠశాలని ఉన్నత పాఠశాలగా మార్చమని ప్రభుత్వానికి తెలియజేస్తానని ప్రకటించాడు.


ఒక నెల తర్వాత ప్రభుత్వ నిర్ణయం రాగానే రత్న తెలివితేటలకు గుర్తింపుగా పాఠశాలకి సరస్వతీ రత్న అప్పర్ ప్రైమరీ స్కూల్ అని పేరు పెట్టి ఆనంద సంబరాలు చేసుకున్నారు.

**......మండా వెంకట అప్పారావు,**
**9347589272**







# దివికెగిన ఆర్థిక & రాజకీయ దిగ్గజం...

## ఆర్థిక సంస్కర్త అస్తమయం...
## ఆర్థిక సంస్కరణల ఆద్యుడు...

మన్మోహన్ సింగ్ 1932 సెప్టెంబర్ 26న అవిభాజ్య భారత దేశంలోని పంజాబ్ ప్రావిన్స్‌లో జన్మించారు. పంజాబ్ విశ్వవిద్యాలయంలో విద్య పూర్తి చేసుకున్న తర్వాత కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నారు. తర్వాత ఆక్స్‌ఫర్డ్‌లో డాక్టరేట్ చేశారు.మన్మోహన్ సింగ్ భార్య పేరు గురుశరణ్ కౌర్. వీరికి ముగ్గురు కుమార్తెలు.

**భారత మాజీ ప్రధానమంత్రి**
**భారతదేశ అభివృద్ధి ప్రధాత**
**ఆర్థిక సంస్కరణల బాటసారి**
**పేదలకు ఉపాధి హామీ పథకం**
**అందరికి ఆధార్ కార్డు అందించి**
**మనకు తెలంగాణ రాష్ట్రం ఇచ్చి**
**గొప్ప దార్శనికత ప్రదర్శించారు**
**వారి మరణం దేశానికి తీరనిలోటు**
**డాక్టర్ మన్మోహన్ సింగ్ గారికి**
**కన్నీటి జోహార్లు.**

**ఆర్థిక సంస్కరణల రథసారథులు..**

పీవీ నరసింహారావును ఆర్థిక సంస్కరణల పితామహునిగా భావిస్తారు. పీవీ విధానాల అమలులో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారు. భారత్‌కు 13వ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించే ముందు ఆయన అనేక బాధ్యతాయుతమైన పదవులు నిర్వహించారు. పీవీ నరసింహారావు ప్రధా నమంత్రిగా ఉన్న సమయంలో 1991-1996 మధ్య మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రిగా పనిచేశారు.మన్మోహన్ సింగ్ 1991లో కేంద్ర ఆర్థిక మంత్రి అయిన తర్వాత రాజకీయంగా ఆయన ప్రతిష్ఠ పెరిగింది. దేశ ఆర్థిక వ్యవస్థ దివాలా దశలో ఉన్నప్పుడు ఆయన ఆ పదవి చేపట్టారు. అనూహ్యంగా వచ్చిన పదవి తరవాత చాలా కాలం ఆయన్ను రాజకీయా ల్లో కొనసాగేలా చేసింది. సివిల్ సర్వెంట్‌గా, ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా పని చేశారు. రిజర్వ్ బ్యాంక్‌కు గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు.ఆర్థికమంత్రిగా తన తొలి ప్రసంగంలో “ఎవరికైనా టైమ్ వస్తే వారి ఆలోచనను ఏ శక్తి కూడా ఆపలేదు” అని విక్టర్ హ్యూగో వ్యాఖ్యల్ని ప్రస్తావించారు.అలా దేశంలో తిరుగులేని ఆర్థిక సంస్కరణల కార్యక్రమానికి బాటలు వేశారు. పన్నుల్ని తగ్గించారు. రూపాయి విలువ నిలబెట్టారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరించారు. విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించారు. దీంతో ఆర్థిక వ్యవస్థ పుంజుకుంది. పారిశ్రామిక రంగం ముందడుగు వేసింది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చింది. 1990ల్లో వృద్ధిరేటు స్థిరంగా కొనసాగింది.

1982 నుంచి 1985వరకు రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా పనిచేశారు.



1985 నుంచి 1987 వరకు ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

1991లోయూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

ఆర్థికమంత్రిగా పీవీ నరసింహరావు నామినేట్ చేసే సమయానికి మన్మోహన్ సింగ్ యూజీసీ చైర్మన్‌గా ఉన్నారు.

1991 జూన్‌లో కేంద్రమంత్రి బాధ్యతలు స్వీకరించిన మన్మోహన్ సింగ్ అదే ఏడాది అక్టోబరులో రాజ్యసభ ఎంపీ అయ్యారు.

అసోం నుంచి వరుసగా ఐదుసార్లు రాజ్యసభ ఎంపీగా పనిచేశారు.

2019లో ఆయన రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళ్లారు.

ఇంగ్లీషు, ఉర్దూలో అనర్గళంగా మాట్లాడగల మన్మోహన్‌సింగ్ మేధావిగా గుర్తింపు పొందారు.

రాజ్యసభ సభ్యత్వం తో ప్రదాని ఐన 4వ వ్యక్తి మన్మోహన్ సింగ్.

**భారత్‌ను ఏ శక్తీ ఆపలేదు...**

1991లో తొలి బడ్జెట్ ప్రసంగంలో మన్మోహన్ సింగ్ చేసిన వ్యాఖ్యలు బాగా ప్రాచుర్యం పొందాయి. “సమయం వచ్చినప్పుడు ఏ శక్తీ ఆపలేదు. ప్రపంచంలో భారత్ కీలక ఆర్థిక శక్తిగా అవతరించడం అన్నది అలాంటి ఆలోచనే అని నేనీ సభకు చెప్పాలనుకుంటున్నా” అని మన్మోహన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఏకనమిలో 5వ స్థానంలోకి చేరుకోవడానికి మన్మోహన్ కృషి ఉంది..

**హంగు, ఆర్భాటం లేని నాయకుడు..**

విద్యావంతుడిగా, మేధావిగా, ప్రజా సేవకుడిగా పేరున్నప్పటికీ, ఆయన ఎప్పుడూ లో ప్రొఫైల్‌లో ఉండేవారు. ట్వీట్లు, పోస్టులు పెట్టే అలవాటు పెద్దగా లేకపోవడం వల్ల ఆయనకు సోషల్ మీడియాలో ఫాలోయర్లు కూడా తక్కువే. తక్కువగా మాట్లాడటం, ప్రశాంతమైన ప్రవర్తనలాంటి కూడా ఆయనకు అభిమానుల్ని సంపాదించి పెట్టాయి. బొగ్గు గనుల కేటాయింపుల్లో లక్షల కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్న ఆరోపణలపై ఆయన తన మౌనాన్ని సమర్థించుకున్నారు. వేల సమాధానాల కంటే అదే ఉత్తమమైనదని చెప్పారు. నేరపూరిత కుట్రకు పాల్పడటం, నమ్మక ద్రోహం, అవినీతికి సంబంధించిన అంశాలలో కోర్టుకు హాజరుకావాలని 2015లో మన్మోహన్ సింగ్‌కు సమన్లు అందాయి. తాను న్యాయ పరీక్షకు సిద్ధంగా ఉన్నానని, వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన రిపోర్టర్లతో చెప్పారు. యూపీఏ-2 ఓటమి తర్వాత మన్మోహన్ సింగ్ ప్రతిపక్షనేతగా కాంగ్రెస్‌పార్టీని ముందుకు నడిపించేందుకు కృషి చేశారు

**ఉపాధి హామీ నుంచి ఆధార్ కార్డు దాకా..**

చరిత్రాత్మకమైన ఎన్నో పథకాలు మన్మోహన్ హయాంలోనే రూపుదిద్దుకున్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకం ఆయన హయాంలోనే పురుడు-పోసుకుంది. అలాగే విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, లోక్‌పాల్, లోకాయుక్త చట్టం, జాతీయ ఆహార భద్రతా చట్టం, ఆధార్ కార్డు, వివిధ పథకాల్లో లబ్ధిదారులకు ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ) వంటి విధానాలను ఆయన సర్కారే మొదటిసారిగా అమలు చేసింది. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలో పేదింటి వారికి ఎంతో మేలు చేసింది.,

**తెలంగాణ కల సాకారం..**

ప్రధానిగా మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ రాష్ట్ర కల సాకారమైంది. 2009లో అప్పటి యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ ఆమోదం మేరకు, ప్రధాని మన్మోహన్ సర్కారు పార్లమెంట్ లో తెలంగాణ బిల్లును ఆమోదించి, దశాబ్దాల కలను నెరవేర్చింది.

**ఎకనామిక్స్ ప్రొఫెసర్ నుంచి ప్రధాని పీఠం దాకా..**

మన్మోహన్ సింగ్ 1963- నుంచి 1971 మధ్య తాను చదివిన పంజాబ్ వర్సిటీతోపాటు ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్లో ప్రొఫెసర్గా పనిచేశారు.1971లో వాణిజ్య శాఖలో ఎకనామిక్ అడ్వైజర్గా చేరారు. 1972లో ఆయనకు ప్రమోషన్ వచ్చింది. దాంతో ఆర్థిక మంత్రిత్వ శాఖలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా నియమితులయ్యారు. ఆ తర్వాత యూఎన్సీటీఏడీ సెక్రటేరియెట్లో పనిచేశారు. అనంతరం 1982ు 85 మధ్య ఆర్బీఐ గవర్నర్గా విధులు నిర్వర్తించారు.గురువారం, ఆయన ఆరోగ్యం క్షీణించడంతో డిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. రాత్రి 9గంటల 51 నిమిషాలకు మన్మోహన్ సింగ్ మరణించారని ఎయిమ్స్ మీడియా సెల్ ప్రొఫెసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ రిమా దాదా ఒక ప్రకటనలో చెప్పారు.

**జాజుల దినేష్.**
**9666238266**

## భరతమాత మెచ్చిన రత్నం మన రతన్ నవల్ టాటా

ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక వేత్త, టాటా గ్రూపు/టాటా సన్స్ కంపెనీలకు 21 ఏళ్ల పాటు చైర్మన్గా పని చేసి, దాతృత్వానికి పెట్టింది పేరుగా నిలిచి, భారతీయులందరికీ గర్వకారణం అయిన రతన్ నవల్ టాటా 28 డిసెంబర్ 1937న సూనీ టాటా - నవల్ టాటా పుణ్య దంపతులకు ముంబాయిలో జన్మించారు. తన 10వ ఏట తల్లితండ్రులు విడిపోవడంతో నాన్నమ్మ నవల్భాయ్ టాటా వద్ద పెరిగారు. పాఠశాల విద్యను “చాంపియన్ స్కూల్” (ముంబయి), “జాన్ క్యానన్ స్కూల్” (ముంబాయి), “బిషప్ కాటన్ స్కూల్” (సిమ్లా)ల్లో పూర్తి చేశారు. అనంతరం 1962లో తన 17వ ఏట “కార్నెల్ యూనివర్సిటీ”లో ఆర్కిటెక్చర్లో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. కొంత కాలం జెమ్షెడ్పూర్ టాటా ఇండస్ట్రీస్లో అసిస్టెంట్గా ఉద్యోగం చేసిన పిదప 1975లో “హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో మేనేజ్మెంట్”లో మేనేజ్మెంట్ కోర్సును సహితం పూర్తి చేశారు.

**టాటా కంపెనీల ఎదుగుదల ప్రస్థానం:** 1991లో ‘టాటా సన్స్’, ‘టాటా గ్రూప్ కంపెనీ’లకు చైర్మన్గా నియమింపబడి 2012 వరకు అప్రతిహతంగా టాటా కంపెనీల రెవెన్యూను 40 రెట్లు, లాభాలను 50 రెట్లు పెంచడంలో ప్రధాన భూమిక నిర్వహించారు. తన మరణం వరకు టాటా సన్స్ అండ్ టాటా గ్రూప్ కంపెనీలకు “చైర్మన్ ఎమిరీటస్”గా కొనసాగారు. నాణ్యతకు పెట్టింది పేరుగా టాటా ఉత్పత్తులను భారతీయులకు కాకుండా ప్రపంచ మానవాళికా పరిచయం చేసిన మహోన్నత దేశభక్తిపరుడు మన రతన్ టాటా. తన నేతృత్వంలో “టెట్లీ టీ”, “జాగ్వార్ లాండ్ రోవర్స్”, “కోరస్” లాంటి ప్రముఖ కంపెనీలను స్వంతం చేసుకొని టాటా గ్రూపులో కలుపగలిగారు. తన జీవితకాలంలో దాదాపు 40 స్టార్ట్ అప్ కంపెనీల్లో వ్యక్తిగత నగదు, టాటా ట్రస్టుల ద్వారా పెట్టుబడులు పెట్టగలిగారు. “టాటా ఇండికా” కారు ప్రజాదరణను చూసిన పిదప దిగువ మధ్య తరగతి భారతీయుల కారు కలలను సాకారం చేయడానికి తక్కువ ధర చేసే బుల్లి ‘నానో’ కారును తీసుకురావడంతో పాటు ఎలక్ట్రిక్ కార్ల తయారీలో ముందు వరుసలో నిలిచారు.

**దాతృత్వానికి చిరునామాగా నిలిచిన రతన్ టాటా:** విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో కోట్ల ధనాన్ని దానం చేసి తనదైన దాతృత్వ గుణాన్ని ప్రదర్శించారు. 1984లో జరిగిన సిక్కుల ఊచకోతలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు టాటా కంపెనీ ట్రక్కులను దానం చేయడం, కార్నెల్ యూనివర్సిటీలో భారతీయ యువత విద్యాభ్యాసానికి (ప్రతి ఏట 20 మంది) 28 మిలియన్ డాలర్ల విరాళ నిధి ఏర్పాటు, న్యూ సౌత్ వేల్స్ యూనివర్సిటీకి సురక్షిత నీటి సరఫరాకు మిలియన్ డాలర్ల విరాళం, కాలిఫోర్నియా యూనివర్సిటీలో టాటా హాల్ నిర్మాణానికి 70 మిలియన్ డాలర్ల విరాళం, హార్వర్డ్ యూనివర్సిటీలో “ఎగ్జిక్యూటివ్ సెంటర్ టాటా హాల్” నిర్మాణానికి 50 మిలియన్ డాలర్ల విరాళం, ఐఐటి ముంబాయిలో “టాటా సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ డిజైన్” ఏర్పాటుకు రూ: 950 మిలియన్ల విరాళం, ఐఐఎస్సిలో “సెంటర్ ఫర్ న్యూరోసైన్స్” ఏర్పాటుకు రూ: 750 మిలియన్ల విరాళం, అమెరికాలోకి ఎంఐటీలో “టాటా సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ డిజైన్” ఏర్పాటుకు పెద్ద మొత్తంలో నగదు విరాళం, కరోనా విపత్తు సమయంలో భారత ప్రభుత్వానికి రూ: 1500 కోట్ల విరాళం లాంటి అనేక విరాళాలను వితరణ చేసి అపర దానకర్ణుడిగా పేరు తెచ్చుకున్నారు.

**రతన్ టాటాను వరించిన ప్రధాన పురస్కారాలు :** భారత ప్రభుత్వం చేత ‘పద్మ భూషన్’, ‘పద్మ విభూషన్’ పౌర పురస్కారాలతో పాటు కాపిటలిజమ్ అవార్డు, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్/రాయల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్/ఓహియో స్టేట్ యూనివర్సిటీ ఫెల్లోషిప్స్, సింగపూర్ గౌరవ పౌర పురస్కారం, బ్రిటీష్ ఆర్డర్ ఆఫ్ ఎంపైర్, ఇటలీ ఆర్డర్ ఆఫ్ మెరిట్, యేల్ యూనివర్సిటీ లీడర్షిప్ అవార్డు, కెనడా గ్లోబల్ ఇండియన్ అవార్డు, ఏసియన్ బిజినెస్ లీడర్ అవార్డు, జపాన్ ప్రభుత్వ ఆర్డర్ ఆఫ్ రైజింగ్ సన్ అవార్డు, రాక్ఫెల్లర్ జీవన సాఫల్య పురస్కారం, సాయాజీ రత్న అవార్డు, ఫ్రాన్స్ ప్రభుత్వ కమాండర్ ఆఫ్ ది లీజియన్ అవార్డు, ఆఫీసర్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా, మహారాష్ట్ర ఉద్యోగ రత్న, అస్సాం వైభవ్ పురస్కారంతో పాటు అనేక దేశ విదేశ యూనివర్సిటీల గౌరవ డాక్టరేట్లు పొంది భారతీయుల మన్ననలు స్వంతం చేసుకున్నారు.

ఆజన్మ బ్రహ్మచారిగా అతి సాధారణ జీవితం గడిపిన రతన్ టాటాకు ముంబాయిలో ఒక చిన్న ఇల్లు, తనదైన ఒక టాటా సెడాన్ కారు ఉన్నాయి. తన 86వ ఏట 09 అక్టోబర్ 2024న వృద్ధాప్య సంబంధ వ్యాధులతో ముంబాయిలో తుది శ్వాస విడిచారు. తన వీలునామా ద్వారా తన సంపదలో సోదర సోదరీమణులు, యువ స్నేహితుడు శాంతను నాయుడు, పెంపుడు కుక్క, వంట మనిషి, గృహ సేవకులకు వాటా కల్పించి తన మంచి మనసును రుజువు చేసుకున్నారు. వ్యాపారవేత్తగా ప్రపంచ మేటి, దాతృత్వంతో అపర దానకర్ణుడు, వ్యక్తిత్వంలో ఆణిముత్యం, జీవన ప్రస్థానంలో విలక్షణత లాంటి అత్యుత్తమ గుణాలను ప్రదర్శించిన రతన్ నావల్ టాటా చూపిన దారి మనందరికీ ఆదర్శం కావాలని, ఆయన సాధారణ జీవితం మనకు ప్రేరణ ఇవ్వాలని కోరుకుందాం. భౌతికంగా మన ముందు లేకపోయినా రతన్ టాటా నేటి యువతకు నిరంతర స్ఫూర్తిని నింపాలని కోరుకుందాం.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037**

## సరికొత్త సీరియల్

# చాకిరేవు

(గతవారం తరువాయి).

ఆదెన్న నన్ను వదిలేస్తాడా? వదిలేస్తే పిల్లలను తీసుకొని ఎక్కడికి వెళ్ళేది? పిల్లలను నాకు ఇస్తాడా? గంగను ఇవ్వకపోవచ్చు, నారాయణ తన కొడుకు కాదని నమ్ముతున్నాడా? అలా నమ్ముతున్నట్లయితే నారాయణను నాకే ఇచ్చేస్తాడు.

పసికందును తీసుకొని ఎలా బతకాలి? పెద్దకోటయ్య దగ్గర పనికి వెళ్తూ, పల్లెలో బిచ్చం ఎత్తుకుంటూ ఒంటరిగా బతకగలనా? నాకు మా అమ్మ తోడు ఉంటుంది. నా గురించి అమ్మకు బాగా తెలుసు, నేను తప్పుడుదాన్ని కాదని ఆదెన్నకు చెప్పింది కూడా. ఆదెన్న అమ్మ మాటలను పట్టించుకోలేదా? నేను మంచిదాన్నని అమ్మ ఆదెన్నకు చెప్పాలా? తనకు మాత్రం తెలియదా? నా మీద నీచమైన నిందలు, ఆరోపణలు చేస్తే ఒక్కమాట కూడా ఎందుకు మాట్లాడలేదు? నన్ను ఊరడించలేదు, ఓదార్చలేదు. ఆదెన్న మౌనం దేనికి సంకేతం?

కొండారెడ్డి ఎంతటి దుర్మార్గుడు! ఆడది లొంగకపోతే ఇంతటి దారుణానికి ఒడగడతాడా? నాలాగా ఇంకెంతమంది ఆడవాళ్లను హింసించి ఉంటాడో! వాళ్ల ఉసురు తగలకుండా ఉంటుందా? పాపం పండకుండా పోతాడా?

కొండారెడ్డి బాగోతం బయటపెడితే ఎలా ఉంటుంది? నా మాట పల్లె ప్రజలు నమ్ముతారా? ముందైతే నమ్మేవాళ్లు, ఇప్పుడు నా మాటలను ఎందుకు నమ్ముతారు? పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనపడినట్లు, రంకు చేస్తున్నావు కాబట్టి అందరూ తప్పుడు మనుషులుగానే కనపడతారని నన్నే నిందిస్తారు. పైగా కొండారెడ్డికి ఎదురొడ్డి నిలబడితే ప్రాణాలు కూడా దక్కవని అందరికీ తెలుసు.

ఇంకా బతికుండి ఎవరిని ఉద్ధరించాలి? నువ్వు రంకుదానివి, బజారుదానివి, ఎవరితోనే పడుకుంటున్నావు, శీలవతివి కాదని పల్లె మొత్తం నమ్మిన తర్వాత బతకడం కంటే చావడమే నయం. నేను చస్తే పిల్లలను ఎవరు చూసుకుంటారు? గంగను ఆదెన్న చూసుకున్నా.. నారాయణ అనాథ అవుతాడు. నా బిడ్డకు తల్లిదండ్రులు లేకుండా పోతారు. నారాయణ కోసమైనా బతకాలి.

నేనెవరో తెలియకపోయినా, అసలు ఒక్కసారి కూడా చూడకపోయినా డబ్బు కోసమో, మరేదాని కోసమో నన్ను ఉంచుకున్నానని అందరిలో ఎలా చెప్పగలిగాడు? వాడి అక్కకో, చెల్లికో, కూతురికో, తల్లికో అలా జరిగితే ఊరికే ఉంటాడా?

పెద్దకోటయ్య, కొండారెడ్డి, స్వామి కలిసే ఇదంతా చేశారు. ఇందులో పెద్దకోటయ్య, స్వామి పాత్రధారులైతే, కొండారెడ్డి సూత్రధారి. కొండారెడ్డికి మరణం ఎందుకు రాలేదు? నీచులకు చావు తొందరగా రాదు. కొండారెడ్డి లాంటివాడు బతికే ఉంటే నా లాంటి ఆడవాళ్లను హింసిస్తూనే ఉంటారు.

కొండారెడ్డిని చంపాలి, ముక్కలు ముక్కలుగా కోసి కాకులకు, గద్దలకు వేయాలి. కొండారెడ్డి చావు చూడాలి, దానికి ఏర్పాట్లు చేసుకోవాలి.

***

సమయం ఎలాంటి గాయలనైనా మాన్పుతుందంటారు కానీ పాపులమ్మ గాయం మానేది కాదు. రెండు రోజుల తర్వాత శారీరకంగా కుదుటపడింది. పెద్దకోటయ్య అంగట్లో పని చేయడానికి వెళ్లింది.

పెద్దకోటయ్య పాపులమ్మను నీచంగా చూశాడు, అవమానకరంగా మాట్లాడాడు. పని చేయించుకునే నెపంతో అసహ్యంగా చేతులు వేశాడు. అలావాటే కదా ఏమీ కాదులే వంకరగా అన్నాడు.

వాటిని భరిస్తూ పెద్దకోటయ్య అంగట్లో పని చేసింది. సద్దిబట్టల కోసం గుడిసెలకు వెళ్లినప్పుడు 'నీ రేటెంత?' అని ఎవడో కూశాడు. 'యాభై ఇస్తాను కాసేపు వస్తవా' ఇంకొకడు కొవ్వుగా చూశాడు.

నీ లాంటి ఆడదానితో బట్టలు ఉత్తికించుకునే కంటే పక్క పల్లె వాళ్లకు వేసుకుంటామని ఒకామె అనింది. నా ఇంటి గడప తొక్కద్దు, నీ నీడ పడితే పచ్చని సంసారాలు నాశనం అవుతాయని ఇంకొకామె కూసింది.

భర్త దగ్గర అచ్చుక్కను పడుకోబెట్టి పల్లె మీద, పల్లెలో గుట్టుగా సంసారాలు చేసుకుంటున్న మగవాళ్ల మీద నీ కన్ను పడితే భగ్గు మనాల్సిందేనని మరో పెద్దావిడ తన చిన్నబుద్ధిని బయటేసుకుంది.

పాపులమ్మకు పల్లెలో ఎవరితో మాట్లాడబుద్ధి అవ్వలేదు, అందరూ ఏదో ఒక మాటతో అవమానించారు. తన మాటను, నడకను, హావభావాలను, చూపును, ప్రతి కదలికకు నానార్థాలు తీశారు.

గుడిసె నుండి బయటకు వెళ్లడానికి భయపడింది, జంకింది. తినడం మానేసింది, సుఖంగా కంటి నిండా నిద్రపోయి చాలా రోజులయ్యింది. ఎవరు అర్థం చేసుకున్నా, చేసుకోకపోయినా ఆదెన్న అర్థం చేసుకొని ఉంటే బాధపడేది కాదు. ఆలోచిస్తూ ఉండగా కడుపులో నొప్పిగా అనిపించింది. అమ్మా అంటూ సుబ్బక్క కోసం కేక వేసింది. బయట పని చేసుకుంటున్న సుబ్బక్క కంగారుగా గుడిసె లోపలికి వెళ్లింది.

పాపులమ్మ స్పృహ తప్పింది. ముఖం మీద నీళ్లు చల్లి, నాడి పట్టుకొని చూసింది. పాపులమ్మ మళ్లీ గర్భవతి అయ్యింది. సుబ్బక్క ముఖంలో అలజడి. ఆదెన్నకు విషయం చెప్పింది. అచ్చక్క సంతోషపడింది.

ఆదెన్న ముఖంలో సంతోషం లేదు. పాపులమ్మతో కలిసి చాలా రోజులైపోయింది, పైగా తన వల్ల గర్భవతి అవ్వలేదనే అనుమానానికి బీజం పడింది. తల దించుకొని గుడిసెలో నుండి బయటికెళ్ళాడు.

@@@

నీ భర్త వచ్చే అవకాశం లేదు, రంకు పని చేసే ఆడవాళ్లతో ఉంటే నీకు కూడా రంకు అంటగట్టారు, రేపొద్దున రంకు కూడా చేయమంటారని అచ్చుక్క తల్లి అచ్చక్కను తీసుకెళ్లింది. గంగులు కోసం ఇన్ని రోజులు ఎదురుచూసింది కానీ జరుగుతున్న పరిణామాల కారణంగా అక్కడే ఉండటం మంచిది కాదనుకుంది. పైగా పాపులమ్మ మళ్లీ గర్భవతి అవ్వడం వల్ల పల్లె మొత్తం ఎలా నిందిస్తుందో, ఏమంటుందో ఊహించగలిగింది. తల్లికి ఎదురు చెప్పకుండా అచ్చుక్క వెళ్లిపోయింది.

ఆదెన్న మనసు మనసులో లేదు, పాపులమ్మ నమ్మకద్రోహం చేసింది. నన్ను మోసం చేయడానికి పాపులమ్మకు మనసు ఎలా వచ్చిందని కుమిలిపోయాడు. భార్యాభర్తలు మాట్లాడుకోకపోతే అనుమానాలు బలపడతాయి. అనుమానం సంసారాన్ని కాల్చి బూడిద చేస్తుంది.

నేనెలాంటి తప్పు చేయలేదని పాపులమ్మ ఆదెన్న కాళ్ల మీద పడింది. ఆదెన్నకు ఏం చేయాలో అర్థంకాలేదు. గర్భవతిగా ఉన్న భార్యను ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక ఓదార్చాడు. భార్య మీద కోపం, ద్వేషం పెంచుకోలేదు కానీ బాధను వృద్ధి చేసుకున్నాడు.

జరిగిన విషయాల గురించి మాట్లాడుకోకుండా ముందుకు సాగారు. నారాయణను గంగ చూసుకుంది. సుబ్బక్క ఇంటిపని చేస్తే, గర్భవతిగా ఉండే పాపులమ్మ పెద్దకోటయ్య అంగట్లో పని చేయడానికి వెళ్లేది.

పాపులమ్మను సొంత చెల్లిలా దగ్గరకు తీసింది వరలక్ష్మి. పల్లెలో అందరూ పాపులమ్మను నిందించినా వరలక్ష్మి మాత్రం ఏమీ అనలేదు. పెద్దకోటయ్యకు తెలియకుండా డబ్బు ఇవ్వడానికి ప్రయత్నిస్తే పాపులమ్మ తీసుకోలేదు.

డబ్బు అయితే తీసుకోవడం లేదని చక్కని వంటలు చేసి ఇచ్చేది. బిచ్చం ఎవరూ ఇవ్వడం లేదు, బట్టలు మాత్రం ఉతికించుకుంటున్నారు. తినడానికి ఇబ్బందిగా ఉందని వరలక్ష్మి ఇచ్చే తిండిని పాపులమ్మ తీసుకునేది.

కొండారెడ్డి ఇంటికి సద్దిబట్టల కోసం వెళ్తే 'ఏమే ఎవరికో అవకాశం ఇచ్చినట్లు ఉన్నావే, నాకు అవకాశం ఇస్తే కొరుక్కుతింటానా?' పాపులమ్మకు చీదరగా అనిపించింది, మౌనంగా తల దించుకుంది.

పాపులమ్మ దగ్గరికిగా వెళ్లి కడుపు మీద చేయి వేసి 'నీ కడుపులో బిడ్డ.. తండ్రి ఎవడని అడిగితే ఏం సమాధానం చెప్తావే? ఇప్పటికైనా మించిపోయింది లేదు. నువ్వు సరే అంటే పదా! నీ కడుపులో బిడ్డకు తండ్రిని నేనేనని నా పేరును నువ్వు గర్వంగా చెప్పుకోవచ్చు. నేను ఉంచుకుంటే పల్లెలో పోయిన నీ మర్యాద నిలబడుతుంది. పంతానికి వెళ్లి ఇప్పటికే కుటుంబాన్ని రోడ్డున పడేశావు. ఇప్పటికైనా వినకపోతే నీ పిల్లల గతి ఏమౌతుందో ఆలోచించుకోమంటూ వెకిలిగా నవ్వాడు.

సద్దిబట్టలను మూట కట్టుకొని మౌనంగా కొండారెడ్డి ఇంటి నుండి వెళ్లిపోయింది.

పాపులమ్మను ప్రతి ఒక్కరూ అవమానిస్తూ, అవహేళన చేశారు. నీచంగా మాట్లాడారు, సందు దొరికితే చాలు పిచ్చి కూతలు కూశారు.

@@@

పెద్దకోటయ్య అంగట్లో పనిచేసే ఈరయ్య చెల్లి పెళ్లి కావడంతో పెళ్లికూతురిని చేసే ముందు చాకలితో దిష్టి తీయించడం ఆనవాయితీ, సంప్రదాయం. అందుకే ఈరయ్య పాపులమ్మను పిలిచాడు.

పాపులమ్మకు వెళ్లడం ఇష్టంలేక సుబ్బక్కను పంపిస్తానని చెప్పింది. ఈరయ్య వినలేదు, నీ గురించి నాకు తెలుసు, నీలాంటి మంచి వ్యక్తితో దిష్టి తీయిస్తే నా చెల్లి సంసారం పది కాలాల పాటు పచ్చగా ఉంటుందని బతిమిలాడాడు. బిచ్చం ఎత్తుకోవడం మొదలైనప్పటి నుండి వేములలో జరిగే శుభకార్యాలకు అచ్చక్క వెళ్లేది. అచ్చుక్క లేదు కాబట్టి సుబ్బక్కను పంపాలనుకుంది కానీ ఈరయ్య కాదు కూడదన్నాడు కాబట్టి పాపులమ్మే పెళ్లి కూతురికి దిష్టి తీయడానికి ఈరయ్య ఇంటికి వెళ్లింది.

పాపులమ్మ ఈరయ్య ఇంటికి వెళ్లగానే అందరూ చెవులు కొరుక్కున్నారు. దీన్ని ఎవరు పిలిచారు? ఇలాంటి దాంతో దిష్టి తీయిస్తే ఇంకేమైనా ఉందా! దీనికి పట్టిన గతే ఈరయ్య చెల్లికి కూడా పడుతుందన్నారు.

అవేమీ పట్టించుకోకుండా పాపులమ్మ నేరుగా ఈరయ్య చెల్లి దగ్గరకు వెళ్లి దిష్టి తీయడానికి సిద్ధమౌతూ ఉండగా ఈరయ్య తల్లి పెద్ద పెద్దగా కేకలు వేసింది. వాడికంటే తెలివిలేక నిన్ను రమ్మనాడే అనుకో.. నీకైనా సిగ్గు, శరం లేదా? నీ లాంటి రంకుముండతో నా కూతురికి దిష్టి తీయిస్తే దాని బతుకు నీ బతుకు లాగే కుక్కలు చించిన విస్తరి అవుతుందని నానామాటలు అనింది. ఈరయ్య తన తల్లిని ఎంత వారించినా వినలేదు. దాంతో పాపులమ్మ ఏడ్చుకుంటూ గుడిసెకు వెళ్లిపోయింది. ఆ తర్వాత పక్క పల్లెలో ఉన్న ఎవరితోనో దిష్టి తీయించారు.

బాధ, ఏడుపు, కన్నీళ్లు, చీకటి తప్ప పాపులమ్మకు మరేమీ కనపడలేదు. ప్రతి



నిమిషం దిగులుపడుతూనే ఉంది. ఇష్టం లేకపోయినా గర్భంలో ఉన్న బిడ్డ కోసం బలవంతంగా తినింది.

గంగ, నారాయణను పెంచడమే కష్టంగా ఉంటే మళ్లీ గర్భవతిని ఎందుయ్యానని బాధపడింది. పిల్లలకు మంచి జీవితాన్ని ఇవ్వలేనప్పుడు, కనడం ఎందుకనుకుంది. ఆదెన్న అంతంతమాత్రమే మాట్లాడుతున్నాడు, భర్త నుండి పొందాల్సిన ప్రేమను పాపులమ్మ పొందలేకపోయింది.

@@@

పొయ్యి మీద పెట్టిన అన్నాన్ని దించుతుండగా గంగ గట్టిగా కేక పెట్టి కుప్పకూలింది. గంగ వేసుకున్న బట్టలు రక్తమయమయ్యాయి. రక్తంలో పడున్న గంగను సుబ్బక్క, పాపులమ్మ మూలకు తీసుకెళ్ళారు.

బట్టలు మార్చి గుడిసెలో మూలన కూర్చోబెట్టారు. గంగ పెద్ద మనిషయ్యింది. పాపులమ్మకు సంతోషపడాలో, బాధపడాలో అర్థంకాలేదు. గంగ పెద్దమనిషి అయ్యిందనే విషయన్ని బయటకు తెలియనీయకూడదనుకుంది.

తల్లి బాధపడుతూ, భయపడుతుంటే కంగారుపడకనీ, నారాయణను, పుట్టబోయే బిడ్డను నేను చూసుకుంటానని పాపులమ్మకు గంగ భరోసా ఇచ్చింది. గంగ మాటలు పాపులమ్మకు సంతోషంగా అనిపించాయి.

గంగ పెద్దమనిషి అవ్వడంతో ఆదెన్న మనసు గుబులు చెందింది. గంగకు పెళ్లి చేసి దూరంగా పంపేయాలనుకున్నాడు. పల్లెలో ఉంటే పాపులమ్మలాగే గంగ జీవితం కూడా నాశనం అవుతుందని భావించాడు. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా పెళ్లి చేసేయాలనుకున్నాడు. ఆదెన్న ఆలోచనను పాపులమ్మ, సుబ్బక్కకు చెప్పాడు. పసి పిల్లకు పెళ్లి ఏందని పాపులమ్మ వారించింది. త్వరగా పెళ్లి చేసి సంసారం అనే చట్రంలో గంగను పడేయడం పాపులమ్మకు ఇష్టం లేదు.

పాపులమ్మ, సుబ్బక్క మాటలను ఆదెన్న వినలేదు. పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. పాపులమ్మ గురించి తెలిసి పెళ్లి చేసుకోడానికి ఎవరూ ముందుకు వెళ్లలేదు. దాంతో కోపం, ఆవేశం, బాధ, అసహనం కలిగాయి.

ఆడపిల్ల పెద్దమనిషి అవుతూనే పెళ్లి చేయడం ఇంకా జరుగుతూనే ఉంది. కనీసం 18 సంవత్సరాలు దాటే వరకు పెళ్లి చేయకూడదనే చైతన్యం చాలా మందిలో లేదు. ఆడపిల్లను భారం అనుకుంటున్నారే కానీ భాద్యతగా భావించడం లేదు. ఎవరికో ఒకరి పెళ్లి చేసేయాలి, ఇంటి నుండి పంపేయాలనే ఆలోచన ఉన్న తల్లిదండ్రులు నేటికీ మన సమాజంలో, మన కుటుంబాలలో ఉండటం విచారకరం.

పిల్లలను ఎలా సాకాలి? పల్లె ప్రజలనే మాటల తూటాల నుండి ఎలా కాపాడాలి? ఇప్పటికే గంగ చాలా చూసింది, దాని ప్రభావం గంగ మీద తప్పకుండా ఉంటుందని పాపులమ్మకు తెలుసు. పిల్లలను ప్రయోజకులను చేయాలి, అందరి పిల్లల్లా చదివించాలి, బట్టలు ఉతికే పని తన పిల్లలు చేయకూడదని బలంగా భావించింది.

గంగకు పదే పదే అవే విషయాలను చెప్పింది. స్వామి పిల్లలు, పెద్దకోటయ్య పిల్లలు చదువుకుంటున్నారు. చదువుకుంటే జ్ఞానం వస్తుంది, ఎవరి కాళ్ల మీద వాళ్లు నిలబడవచ్చు. ఇలా బట్టలు ఉతుకుతూ, చాకిరీ చేస్తూ మా బతుకుల మాదిరి మీవి అవ్వకూడదు.

నా తర్వాత నారాయణకు, పుట్టబోయే బిడ్డకు నువ్వే తల్లివని చెప్పింది. గంగ మనసులో పాపులమ్మ మాటలు బలంగా నాటుకుపోయాయి. అది మాత్రమే కాకుండా కొండారెడ్డి, స్వామి, పెద్దకోటయ్య లాంటివాళ్లు తల్లిని ఎలా బాధించారో గుర్తు పెట్టుకుంది. ఎలాగైనా వాళ్ల మీద పగ తీర్చుకోవాలనుకుంది.

సుబ్బక్క ఆరోగ్యం సరిగా ఉండటం లేదు. వృధాప్యం మీద పడి చాలా సంవత్సరాలు అయ్యింది కాని బిడ్డ కోసం, బిడ్డ పిల్లల కోసం బండి చాకిరీ చేస్తోంది. ఈ మధ్య రాత్రి పూట అసలు పడుకోవడం లేదు,

(మిగతా వచ్చేవారం)

జాని తక్కెడశిల
7259511956





# భారతీయ సినిమా దార్శనికుడు రాజ్ కపూర్

**భారతీయ సినీ పరిశ్రమలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తిగడించిన సినీ దిగ్గజం రాజ్ కపూర్. 40 సంవత్సరాల చిత్రసీమ జీవితంలో ప్రపంచం గర్వించదగిన నటుడు, దర్శకుడిగా తనకుంటూ ఒక ప్రత్యేకస్థానం సంపాదించుకున్న నటుడు, దర్శకుడు, నిర్మాత, ఎడిటర్, కథకుడు రాజ్ కపూర్. బ్లాక్ బస్టర్ చిత్రాలను అందించడంలో ఆయన దిట్ట. రొమాంటిక్ సినిమాలతో గిలిగింతలు పెట్టినా, భావోద్వేగాలతో ప్రేక్షకులను ఏడ్పించినా ఆయనకే చెల్లు.**


భారతీయ సినీ పరిశ్రమలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తిగడించిన సినీ దిగ్గజం రాజ్ కపూర్ తొలి సినిమా విడుదలై 75 సంవత్సరాలు దాటింది. అయినప్పటికీ ఈ నాటికీ రష్యాలో ఆయన చిత్రంలోని 'ఆవారాహూ' అనే పాట వినపడుతుంది. చైనా వారు అభిమానించే భారతీయ నటుడు ఎవరు? అని ప్రశ్నిస్తే రాజ్ కపూర్ అని ఠక్కున చెబుతారు. 'ది గ్రేటెస్ట్ షో మేన్ ఆఫ్ ఇండియన్ సినిమా' ఖ్యాతి నార్జించిన రాజ్‌కపూర్ 1924 డిసెంబర్ 14న బ్రిటిష్ ఇండియా (ప్రస్తుతం పాకిస్థాన్‌లోని కైబర్ పంకుతుంఖ్వా) లోని పెషావర్‌లో ప్రముఖ ఖాత్రి పంజాబీ హిందూ కపూర్ కుటుంబం, కపూర్ హవేలీలో నటుడు పృథ్వీరాజ్ కపూర్, రామ్ సర్నీదేవి కపూర్ దంపతులకు జన్మించారు. వీరికి కలిగిన ఆరుగురు సంతానంలో పెద్దవారు. రాజ్. వీరి పూర్తిపేరు రణబిర్ రాజ్ కపూర్. చిత్రపరిశ్రమలో రాజ్‌కపూర్, స్నేహితులు, బంధువులు రాజ్ సాహెబ్ అని పిలుచుకుంటారు. రాజ్ కపూర్ అసలు పేరు శృతి నాథ్ కపూర్. రాజ్ కపూర్ తాత పేరు దివాన్ బషేశ్వర్నాథ్ కపూర్. వీరు చిన్న వయస్సులోనే చిత్ర పరిశ్రమలో నటనను వృత్తిగా స్వీకరించి దర్శక, నిర్మాత, నటుడిగా, భారతీయ సినిమా రంగానికి చార్లీ చాప్లిన్‌గా స్థిరపడ్డారు.

**బాల్యం :** రాజ్ కపూర్ తండ్రి పృథ్వీరాజ్ కపూర్ 1930లో తన కెరీర్ ప్రారంభంలో ఒక నగరం నుండి వేరొక నగరానికి వెళ్ళినప్పుడు, కుటుంబం కూడా చాలా ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చింది. ఆ క్రమంలో రాజ్ కపూర్ కల్నల్ బ్రౌన్ కేంబ్రిడ్జ్ స్కూల్, డెహ్రాడూన్, సెయింట్ జేవియర్స్ కాలేజియేట్ స్కూల్, కలకత్తా, ముంబై లలోని వివిధ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు.

**సినీ జీవితం :** తన పదేళ్ళ వయసులో ఇంక్విలాబ్ (1935) చిత్రంలో నటించడం ద్వారా తొలిసారిగా బాలీవుడ్ చిత్రంలో రాజ్ కపూర్ కనిపించారు. తరువాత రాజ్ కపూర్ చాలా కాలం పాటు సినిమాలలో నటించలేదు. రాజ్ కపూర్ మెట్రిక్యులేషన్ తరువాత తన తండ్రి ఫృథ్వీరాజ్ కపూర్‌తో 'నేను సినిమాల్లో పనిచేస్తాను' అన్నారు. అందుకు ఫృథ్వీరాజ్ బదులిస్తూ 'సినిమాల్లో పనిచేయాలంటే ఉదయాన్నే తెల్ల దుస్తులు ధరించి, సాయంత్రానికి వాటికి దుమ్ము కొట్టుకుని రావలసి ఉంటుంది. పైగా సినిమా నిర్మించాలంటే అన్ని పనులు తెలిసి ఉండాలి" అని చెప్పి తొలుత స్టూడియోలో పనికి పెట్టారు.

**(మిగతా 8వ పేజీలో)**






(7వపేజీ తరువాయి)

అప్పటికే పృథ్వీరాజ్ కపూర్‌కు నటుడిగా చాలా పేరుంది. అయినా రాజ్ కపూర్‌కు అన్ని విషయాలు తెలుసుకోవాలని సాధారణ క్లాప్ బాయ్‌గానే జీవితాన్ని మొదలు పెట్టారు. తండ్రి వద్దనే పృథ్వీ థియేటర్‌లో పది రూపాయల జీతానికి చేరారు. ఆ సమయంలో రాజ్ కపూర్ వద్ద రెండు జతల దుస్తులు, వర్షాకాలంలో ఉపయోగించుకోవడానికి రెయిన్ కోట్, టోపీ మాత్రమే ఉన్నాయి.

విరామం తరువాత కిదార్ శర్మ తెరకెక్కించిన నీల్ కమల్ (1947) లో మధుబాల సరసన నటించారు. 1948 లో తన ఇరవై నాలుగు సంవత్సరాల వయసులో అతను తన సొంత స్టూడియో, ఆర్కె ఫిల్మ్స్ ను స్థాపించారు. నర్గిస్, కామిని కౌషల్, ప్రేమ్‌నాథ్ నటించిన 'ఆగ్' చిత్రానికి దర్శకత్వం వహించి, ఆ కాలంలో అతి చిన్న వయసు చిత్ర దర్శకునిగా గుర్తింపు పొందారు. ఆ చిత్రం చేదు అనుభవాన్ని మిగిల్చింది. తరువాతి సంవత్సరం బర్సాత్‌లో నటించడమే కాక దర్శకత్వం కూడా వహించారు. ఆ చిత్ర ఘన విజయాన్ని సాధించింది. అక్కడి నుండి నటుడు, దర్శకుడిగా తన పయనాన్ని కొనసాగించారు. మే 1946 లో రాజ్ కపూర్ కృష్ణ మల్హోత్రాను వివాహం చేసుకున్నారు. అట్టహాసంగా కాకుండా సాధారణ భారతీయ పద్ధతిలో పెళ్ళి జరిగింది. కృష్ణ మల్హోత్రా సోదరులు రాజేంద్ర నాథ్, ప్రేమ్ నాథ్, నరేంద్ర నాథ్ తరువాత నటులు అయ్యారు. ఆమె సోదరి ఉమా నటుడు ప్రేమ్ చోప్రాను వివాహం చేసుకున్నారు. రాజ్ కపూర్ వివాహ వార్త సినీ-మ్యాగజైన్ ఫిల్మిండియా జూన్ 1946 సంచికలో ప్రచురించారు.

**ఒకవైపు విజయాలు-మరోవైపు అపజయాలు**

సామాన్య మనిషే కథానాయకుడిగా అనేక చిత్రాలను రాజ్ కపూర్ నిర్మించారు. రాజ్ కపూర్ 1949 లో మెహబూబ్ ఖాన్ హిట్ చిత్రం 'అందాజ్' లో దిలీప్ కుమార్, నర్గిస్‌తో కలిసి నటించారు. ఇది నటుడిగా ఆయన తొలి అతి పెద్ద విజయం. ఆ సంవత్సరం తరువాత విడుదలైన 'బర్సాత్' చిత్రానికి నిర్మాత, దర్శకుడు, కథానాయకునిగా సంచలన విజయాన్ని సాధించారు. రాజ్ కపూర్ తన ఆర్.కె బ్యానర్‌లో అవారా (1951), శ్రీ 420 (1955), జగ్తే రహో (1956), జిస్ దేశ్ మే గంగా బెహతీ హై (1960) వంటి అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించి, వాటిలో నటించారు. అందులో చివరి చిత్రానికి ఆయన చిత్రాలకు చిరకాల ఛాయాగ్రాహకునిగా ఉన్న రాధు కర్మకర్ దర్శకత్వం వహించారు. ఆ చిత్రం ఉత్తమ చిత్రంగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారాన్ని గెలుచుకోవడంతో పాటు చార్లీ చాప్లిన్ ది ట్రాంప్ ఇమేజ్‌ను సంపాదించి పెట్టింది. రాజ్ కపూర్ సొంత బ్యానర్ పై కాకుండా ఇతర సినిమా నిర్మాణాలలో నటుడిగా పలు చిత్రాలలో నటించారు. దస్తాన్ (1950), అన్హోనీ (1952), ఆహ్ (1953), బూట్ పోలిష్ (1954), చోరి చోరి (1956), అబ్ దిల్లీ డోర్ నహి (1957), అనారీ (1959), ఛాలియా (1960), దిల్ హాయ్ తూ హై (1963) ఇత్యాది బయటి చిత్రాలలో కూడా నటించారు. ఆయన విజయవంతమైన అనేక సామాజిక చిత్రాలను కూడా నిర్మించారు. రాజ్ కపూర్ 1955లో తీసిన ఆవారా చిత్రం ఇరాన్, ఇరాక్,



సిరియా, టర్కీ, సోవియెట్ యూనియన్‌లలో ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించింది. ఆవారా చిత్రం పాటలను 12 అంతర్జాతీయ భాషల్లోకి అనువదించారు. నేడు పాన్ ఇండియా సినిమాల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చుచేసి గొప్పగా చెప్పుకుంటూ చిత్రాలను నిర్మిస్తున్నారు. ఆ కాలంలోనే పాన్ ఇండియా చిత్రాలను అందించిన ఘనత రాజ్ కపూర్‌కు దక్కుతుంది.

రాజ్ కపూర్ 1964 లో రాజేంద్ర కుమార్, వైజయంతిమాలలతో పాటు రొమాంటిక్ మ్యూజికల్ చిత్రం 'సంగం' ను నిర్మించారు. ఆ చిత్రానికి దర్శకత్వం వహించి, నటించారు. ఇది ఆయన నటించిన తొలి పంచరంగుల చిత్రం. సంగం చిత్రంలో పాటలు సూపర్ హిట్ అయ్యాయి. చిత్రం ఘనవిజయాన్ని సాధించింది. సంగం తరువాత వచ్చిన చిత్రాలు అపజయంపాలై నిరాశకు గురిచేశాయి. దుల్హా దుల్హాన్ (1964), అరౌండ్ ది వరల్డ్ (1966), సప్నోన్ కా సౌదాగర్ (1968), యువ నటులు సాధన, రాజశ్రీ, హేమమాలినిలతో నిర్మించిన చిత్రాలు అపజయాలు పొందాయి. రాజ్ కపూర్ 1965లో నాల్గవ మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో జ్యూరీ సభ్యునిగా ఉన్నారు. 1970 లో రాజ్ కపూర్ తన ప్రతిష్టాత్మక చిత్రం 'మేరా నామ్ జోకర్' ను నిర్మించి, దర్శకత్వం వహించి అందులో నటించారు. ఇది పూర్తి కావడానికి ఆరు సంవత్సరాలకు పైగా కాలం పట్టింది. ఇది నాలుగు గంటల నిడివి కల చిత్రం. ఈ చిత్రం నిడివి పెద్దది కావడంతో ప్రేక్షకులకు రెండుసార్లు విశ్రాంతి ఇచ్చారు. ఈ చిత్రంలో రాజ్ కపూర్ నూనూగు మీసాలతో యుక్తవయస్సులో ఉన్న పాత్రని ఆయన కుమారుడు రిషి కపూర్ పోషించారు. 1970 లో విడుదలైనప్పుడు మేరానామ్ జోకర్ చిత్రం ఆశించిన స్థాయిలో విజయవంతం కానందువల్ల కపూర్, ఆయన కుటుంబం ఆర్థిక సంక్షోభంలో పడ్డారు. తరువాతి సంవత్సరాల్లో ఈ చిత్రం సెన్సేషన్‌గా నిలిచి సూపర్‌హిట్ అయ్యింది. 1971 లో రాజ్ కపూర్ పెద్ద కుమారుడు రణధీర్ కపూర్‌ను కుటుంబ కథా చిత్రం "కల్ ఆజ్ ఔర్ కల్" ద్వారా చిత్రసీమకు పరిచయం చేసారు. ఈ చిత్రంలో అతని కుమారుడు రణధీర్, తండ్రి పృధ్వీరాజ్ కపూర్, రణధీర్ భార్య బబితలు నటించారు. రాజ్ కపూర్ తన రెండవ కుమారుడు రిషి కపూర్ ను 1973లో చిత్రసీమకు తాను నిర్మించి, దర్శకత్వం వహించిన "బాబీ" సినిమా ద్వారా పరిచయం చేసారు. ఇది భారీ బాక్సాఫీస్ విజయాన్ని సాధించింది. ఈ చిత్రం ద్వారా నటి డింపుల్ కపాడియాను హీరోయిన్‌గా పరిచయం చేశారు. తరువాత కాలంలో ఆమె చాలా ప్రజాదరణ పొందిన నటిగా గుర్తింపు పొందారు. బాబీ చిత్రం కొత్త తరం టీనేజ్ రొమాన్స్ చిత్రాలలో మొదటిది అని చెప్పవచ్చు. డింపుల్ బికినీలు ధరించి అర్ధనగ్న దృశ్యాలలో నటించడం అప్పట్లో సంచలనాన్ని సృష్టించింది. రాజ్ కపూర్ 1975 లో తన కుమారుడు రణధీర్‌తో కలిసి 'ధరం కరం' చిత్రం లో మరోసారి నటించారు. ఈ చిత్రానికి రణధీర్ కూడా దర్శకత్వం వహించారు.

(మిగతా 9వ పేజీలో)







(8వ పేజీ తరువాయి)

1970ల చివరి భాగంలో, 1980 ప్రారంభంలో హీరోయిన్ ప్రధాన భూమికలో నటించే చిత్రాలను రాజ్ కపూర్ నిర్మించి, దర్శకత్వం వహించారు. జీనత్ అమన్‌తో సత్యం శివం సుందరం (1978), ప్రేమ్ రోగ్ (1982) పద్మిని కొల్హాపూరీ, రామ్ తేరి గంగా మైలీ (1985) చిత్రంలో మందాకిని ఇత్యాది హీరోయిన్‌లు ప్రధాన భూమికలో నటించారు. రాజ్ కపూర్ 1970 ల చివరలో, 1980 ల ప్రారంభంలో తక్కువ చిత్రాలలో నటించారు. నౌక్రీ (1978) లో రాజేష్ ఖన్నాతోను, అబ్దుల్లా (1980) లో సంజయ్ ఖాన్‌తోను గుర్తింపువున్న పాత్రల్లో నటించారు. ఆయన రెండు కామెడీ చిత్రాలలో డిటెక్టివ్ పాత్ర పోషించారు. ఆయన నటించిన దో జాసూస్ (1975), గోపిచంద్ జాసూస్ (1982) ఇత్యాది రెండు చిత్రాలకు నరేష్ కుమార్ ( రాజేంద్ర కుమార్ సోదరుడు) దర్శకత్వం వహించారు. 1979 లో ఆయన 11 వ మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో జ్యూరీ సభ్యునిగా ఉన్నారు. రాజ్ కపూర్ నటించిన చిత్రం వకీల్ బాబు 1982లో విడుదలైంది. ఈ చిత్రంలో ఆయన తన తమ్ముడు శశి కపూర్ తో కలిసి కనిపించారు. అతను 1982 లో చిత్రీకరించిన, పూర్తి చేసిన చిత్రం చోర్ మండలి చిత్రంలో తోటి నటుడు అశోక్ కుమార్‌తో కలసి నటించారు. చట్టపరమైన వివాదం కారణంగా ఆ చిత్రం విడుదల కాలేదు. ఆయన చివరిగా 1984 లో బ్రిటిష్ నిర్మిత టెలివిజన్ చిత్రం 'కిమ్' విడుదలైంది. ఇది రాజ్ కపూర్ చివరి చిత్రం. ఇందులో ఆయన అతిథి పాత్రలో నటించారు. రాజ్ కపూర్ 1988 లో మరణించే ముందు తన కుమారుడు రిషికపూర్, పాకిస్తాన్ నటి జెబా బక్తియార్ నటించిన 'హెన్నా' చిత్రానికి దర్శకత్వం వహించాలనుకున్నారు. కానీ ఆయన కుమారుడు రణధీర్ కపూర్‌ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. హెన్నా 1991 లో విడుదలైంది. బాబీ చిత్రంలో రాజ్ కపూర్ ఎక్స్‌పోజింగ్ సన్నివేశాలకు తెరలేపారు. బాబీలో డింపుల్ కపాడియా అర్ధనగ్న దృశ్యాలు, సత్యం శివం సుందరం చిత్రంలో జీనత్ అమన్ రవిక లేకుండా నటించిన దృశ్యాలు, రామ్ తేరీ గంగామైలీ చిత్రంలో మందాకినీ ఏకంగా స్తనాలను చూపించడం అప్పట్లో పెద్ద దుమారాన్నే లేపాయి. ఆ తరువాతి తరంలో ఆయన మనుమరాళ్ళు కరిష్మా, కరీనా కపూర్లను ఇతర దర్శకులు ఇటువంటి అర్ధనగ్న దృశ్యాలలో చూపించారు.

**మరణం** :రాజ్ కపూర్ తన చివరిరోజులు ఆస్తమాతో బాధపడ్డారు. ఆయన 1988 జూన్ 2న తన 63 సంవత్సరాల వయసులో ఈ వ్యాధికి సంబంధించిన సమస్యలతో కొత్త ఢిల్లీలో మరణించారు. రాజ్ కపూర్‌కు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కార బహూకరణ సభ జరుగుతుంది. ఆడిటోరియం నిండా జనం నిండిపోయారు. చప్పట్లతో దద్దరిల్లిపోతుంది. అప్పటి రాష్ట్రపతి ఆర్. వెంకట్రామన్ పురస్కారాన్ని అందించడానికి వచ్చారు. రాజ్ కపూర్ కుర్చీలోంచి లేవలేకపోయారు. ఆస్తమా పెరిగిపోయి ఆయన కళ్ళు మూతపడ్డాయి. వేదికపైకి ఎక్కలేకపోయారు. ప్రోటోకాల్‌ను ప్రక్కన పెట్టి రాష్ట్రపతి ఆర్ వెంకట్రామన్ స్వయంగా వేదిక దిగి రాజ్‌కపూర్ వద్దకు వెళ్ళి పురస్కారాన్ని అందించారు. రాష్ట్రపతి ఇలా వేదిక దిగి పురస్కారాన్ని అందించిన ఘటన మరొకటి లేదనే చెప్పాలి. రాజ్ కపూర్ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్న తరువాత రాజ్ కపూర్ కుప్పకూలిపోయాడు. చికిత్స కోసం ఆల్



ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ( ఎయిమ్స్ ) కి తీసుకువెళ్ళారు. ఉబ్బసం వల్ల తలెత్తే సమస్యల వల్ల ఒక నెలపాటు ఆసుపత్రిలో ఉన్నారు. మరణించే సమయంలో అతను హెన్నా (ఇండో-పాకిస్తాన్ ఆధారిత ప్రేమకథ) చిత్రంలో పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తరువాత అతని కుమారులు రణధీర్ కపూర్, రిషి కపూర్ పూర్తి చేశారు. ఇది 1991 లో విడుదలైంది.

**వ్యక్తిగత జీవితం**

రాజ్ కపూర్ భార్యపేరు కృష్ణా మల్హోత్రా. ఈ దంపతులకు అయిదుగురు సంతానం. నటులు రణధీర్ కపూర్, రిషి కపూర్, రాజీవ్ కపూర్ కుమారులు కాగా రితు నందా, రిమా జైన్ కుమార్తెలు. పెద్ద కుమారుడు రణధీర్ కపూర్ మాజీ నటి బబితను వివాహం చేసుకున్నారు. బాలీవుడ్ హీరోయిన్లుగా ప్రసిద్ధి చెందిన కరిష్మా కపూర్, కరీనా కపూర్ ఈ దంపతుల కుమార్తెలు. రెండో కుమారుడు రిషి కపూర్ మాజీ నటి నీతు సింగ్‌ను వివాహం చేసుకున్నారు. ఈ దంపతుల కుమార్తె రిద్ధిమా, కుమారుడు బాలీవుడ్ నటుడు రణబీర్ కపూర్. రాజ్ కపూర్ పెద్ద కుమార్తె రితు నందా పారిశ్రామికవేత్త రాజన్ నందా ను వివాహం చేసుకున్నారు . వారికి ఇద్దరు పిల్లలు. ఆమె కుమారుడు నిఖిల్ నందా బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్, జయ బచ్చన్ల కుమార్తె శ్వేతను వివాహం చేసుకున్నారు. రాజ్ కపూర్ చిన్న కుమార్తె రిమా జైన్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంకర్ మనోజ్ జైన్ ను వివాహం చేసుకున్నారు. ఆమె కుమారుడు నటుడు అర్మాన్ జైన్. రాజ్ కపూర్ సోదరులు శశి కపూర్, శమ్మీ కపూర్ కూడా ప్రముఖ నటులుగా రాణించారు. రాజ్ కపూర్ ముగ్గురు కుమారుల్లో రిషి కపూర్ హీరోగా రాణించారు. రణ్‌ధీర్ కపూర్ హీరోగా, దర్శక, నిర్మాతగా కూడా అంతగా రాణించలేకపోయానా ఆయన కుమార్తెలు కరిష్మా, కరీనాల వల్ల గుర్తింపు పొందారు. రణ్‌ధీర్ కపూర్ చివరకు మద్యానికి బానిసై 58 ఏళ్ళ వయస్సులోనే గుండెపోటుతో కన్ను మూశారు. చిన్న కుమారుడు రాజీవ్ కపూర్ కూడా అంతగా హిట్ హీరోగా పేరు గడించలేకపోయారు. రాజీవ్ కపూర్‌ను అందరూ చింపూ కపూర్ అని పిలిచేవారు. రాజ్ కపూర్‌కు ఊర్మిళా సియాల్ అనే సోదరి కూడా ఉంది. మరో ఇద్దరు తోబుట్టువులు బాల్యంలోనే మరణించారు. తరువాత వారు పెషావర్ నుండి నేటి భారతదేశానికి విద్యాభ్యాసం కోసం వచ్చారు. రాజ్ తల్లి బంధువైన జుగ్గల్ కిషోర్ మెహ్రా గాయని. ఆయన మనవరాలు సల్మా ఆఘా తరువాత బాలీవుడ్ నటి అయ్యారు. సినిమా పరిశ్రమకు చెందిన ప్రాణ్, ముఖేష్, దేవ్ ఆనంద్, దిలీప్ కుమార్, రాజేంద్ర కుమార్, మన్నా డే, శంకర్-జైకిషన్, హృషికేశ్ ముఖర్జీ, ఖ్వాజా అహ్మద్ అబ్బాస్, రాజేష్ ఖన్నా లు రాజ్ కపూర్ సన్నిహితులుగా మెలిగారు.

**భగ్న ప్రేమికుడు**

రాజ్ కపూర్ 1940-1950 ప్రాంతంలో నటి నర్గిస్‌తో ప్రేమను బంధం ఏర్పడింది. రాజ్ కపూర్ వివాహితుడు అయినందువల్ల ఆమెతో పెళ్ళికి అంగీకరించలేదు. ఈ జంట కలిసి 'ఆవారా', 'శ్రీ 420' తో సహా పలు చిత్రాల్లో నటించారు. రాజ్ తన భార్య, పిల్లలను విడిచిపెట్టనందున 'చోరి చోరి' చిత్రం తరువాత నర్గీస్ వారి సంబంధాన్ని స్వస్తి పలికి సునీల్ దత్ ను వివాహం చేసుకున్నారు. నర్గీస్ మదర్ ఇండియా (1957) సెట్లో సునీల్ దత్ తో ప్రేమలో పడ్డారు. 1960వ దశకంలో రాజ్ కపూర్ 'సంగం' చిత్ర షూటింగ్ సందర్భంగా వైజయంతిమాలాతో ప్రేమలో పడినట్లు సన్నిహితులు చెబుతుంటారు.

(మిగతా 10వ పేజీలో)



( 9వ పేజీ తరువాయి)

కపూర్‌తో ఎప్పుడూ తన కు సంబంధం లేదని వైజయంతిమాల అప్పట్లో పత్రికల్లో ఖండిం చారు. రాజ్ కపూర్ తన సినిమాను ప్రొమోట్ చేసుకోవడానికి ఈ విషయం ఒక పబ్లిసిటీ స్టంట్ గా ఆమె భావించారు. ఆ తరువాత రాజ్ కపూర్‌కు దక్షిణాది నటి పద్మినితో కూడా సంబంధం ఉంది. 2017 లో అతని రెండవ కుమారుడు రిషి తన ఆత్మకథ 'ఖుల్లం ఖుల్లా'లో తండ్రి వ్యవహారాలను ధృవీకరిస్తూ పేర్కొన్నారు. రాజ్ కపూర్ తన సినిమా సంగీతం, పాటలకు తానే న్యాయమూర్తిగా వ్యవహరించేవారు. తన కెరియర్ ఆరంభించిన చాలా చిత్రాల్లోని పాటలు విజయం పొందాయి. అతను సంగీత దర్శకులను శంకర్–జైకిషన్, గీత రచయితలు హస్రత్ జైపురి, శైలేంద్రలతో పాటు నిమ్మీ, డింపుల్ కపాడియా, మందాకిని ఇత్యాది నటీమణులను చిత్రసీమకు పరిచయం చేశాడు,

**రాజ్ కపూర్ శతజయంతి నివాళి :** రాజ్ కపూర్ శత జయంతిని పురస్కరించుకుని 2024 డిసెంబర్ 13 నుండి 15 వరకు ఆయన నటించిన ఐకాన్ చిత్రాలను భారత దేశంలోని 40 నగరాలలోని 150 థియేటర్లలో ప్రదర్శించారు. రాజ్ కపూర్ '100 సెలబ్రేటింగ్ ది సెంచరీ ఆఫ్ ది గ్రేటెస్ట్ షో మెన్' పేరుతో ఆర్‌కే ఫిలిమ్స్, ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా' ల నేతృత్వంలో ఈ చిత్రాల ప్రదర్శన జరిగింది. రాజ్ కపూర్ చిత్ర జీవితంలో ఐకాన్ చిత్రాలుగా నిలిచిన ఆగ్ (1948), బర్సాత్




(1949), ఆవారా (1951), శ్రీ 420 (1955), జాగ్తే రహో (1956), జిస్ దేశ్ మే గంగా బహ్‌తీ హై (1960), సంగం (1964), మేరా నామ్ జోకర్ (1970), బాబీ (1973), రామ్ తేరీ గంగా మైలీ (1985), ఇత్యాది చిత్రాలను ప్రదర్శించారు.

**పురస్కారాలు :** రాజ్ కపూర్ హిందీ చిత్ర జీవితం చాలా గొప్పగా సాగింది. అత్యంత ప్రభావవంతమైన నటునిగా, చలన చిత్ర నిర్మాతలలో ఒకనిగా ప్రపంచంలోని అనేక దేశాలలో ప్రసిద్ధి చెందారు. భారతదేశంలో 3 జాతీయ చలనచిత్ర అవార్డులు, 11 ఫిల్మ్‌ఫేర్ అవార్డులతో సహా పలువురి ప్రశంసలు కూడా అందుకున్నారు. రెండు ఉత్తమ చిత్రాలకు ఫిల్మ్‌ఫేర్ పురస్కారం, ఉత్తమ నటునిగా రెండు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు, ఉత్తమ దర్శకునిగా నాలుగు ఫిల్మ్‌ఫేర్ పురస్కారం, ఉత్తమ ఎడిటింగ్ కోసం ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు, రెండు నేషనల్ ఫిల్మ్ అవార్డులు అందుకున్నారు. ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు రాజ్ కపూర్ పేరు పెట్టడం విశేషం. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవారా (1951), బూట్ పోలిష్ (1954) చిత్రాలకు పామ్ డి ఓర్ గ్రాండ్ ప్రైజ్ కోసం ఆయన రెండుసార్లు నామినేట్ అయ్యారు. అవారా చిత్రంలో రాజ్ కపూర్ నటన టైమ్ మ్యాగజైన్ ప్రచురించిన 10 అత్యుత్తమ ప్రదర్శనలలో ఒకటిగా నిలిచింది. ఆయన నటించిన చిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యంగా ఆసియా, ఐరోపాలో ప్రేక్షకులను ఆకర్షించాయి. ఆయనను "ది క్లార్క్ గేబుల్ ఆఫ్ ది ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ" అని పిలిచేవారు. చలనచిత్ర కళా రంగానికి ఆయన చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం 1971 లో పద్మ భూషణ్‌తో సత్కరించింది. చలన చిత్రం రంగంలో భారతదేశపు అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును 1987 లో భారత ప్రభుత్వం ఆయనకు ప్రదానం చేసింది. ఆయన చిత్రం జగ్తే రహో (1956) కార్లోవీ వేరి అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో క్రిస్టల్ గ్లోబ్ అవార్డును కూడా గెలుచుకుంది. 2001 లో స్టార్‌డస్ట్ పత్రి క "మిలీనియం ఉత్తమ దర్శకుడు" పురస్కారంతో సత్కరించారు. 2002 లో స్టార్ స్క్రీన్ పురస్కారం ద్వారా రాజ్ కపూర్‌కు "షోమాన్ ఆఫ్ ది మిలీనియం" అని బిరుదు ప్రదానం చేశారు. మనదేశంలో షో మేన్ అనే సార్థకనామం సంపాదించుకున్న తొలి నటుడిగా రాజ్ కపూర్ నిలిచిపోయారు.

**– షేక్ అబ్దుల్ హకీం జానీ,**
**9949429827**

'విక్రాంత్ రోణ' తర్వాత కన్నడ స్టార్ 'కిచ్చా' సుదీప్ పూర్తి స్థాయి హీరోగా నటించిన సినిమా 'మ్యాక్స్'. సుమారు రెండేళ్ల విరామం తర్వాత ఆయన నటించిన సినిమా కావడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు. కన్నడనాట సినిమాకు సూపర్ హిట్ టాక్ లభించింది. మరి, తెలుగు ప్రేక్షకులకు నచ్చే అంశాలు సినిమాలో ఏమున్నాయి? ప్రముఖ తమిళ నిర్మాత కలైపులి ఎస్ థాను నిర్మించిన ఈ సినిమా ఎలా ఉంది? అనేది చూస్తే...

**కథ :**

గని భాయ్ (సునీల్) ఇచ్చిన పార్టీ నుంచి డ్రగ్స్ మత్తులో మునిగి తేలిన ఇద్దరు మంత్రుల కుమారులు పార్టీ నుంచి వెళ్లే దారిలో ఓ మహిళ పోలీసుతో అసభ్యంగా ప్రవర్తిస్తారు. తెల్లారితే డ్యూటీలో జాయిన్ కావాల్సిన సీఐ మ్యాక్స్ అలియాస్ అర్జున్ మహాక్షయ్ (సుదీప్) అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి పంపిస్తాడు.

మంత్రుల కుమారులు ఇద్దరి కోసం స్టేషన్ మీదకు రౌడీలు గుంపులు గుంపులుగా వస్తారు. వాళ్ళను మ్యాక్స్ అండ్ టీమ్ ఎలా ఎదుర్కొన్నాడు? సెల్లో వేసిన ఇద్దరూ ఎలా మరణించారు? క్రైమ్ డిపార్ట్మెంట్లో పని చేసే లేడీ సీఐ రూప (వరలక్ష్మి శరత్ కుమార్) నుంచి మ్యాక్స్ అండ్ టీమ్ ఎదుర్కొన్న ముప్పు ఏమిటి? గని ఏం చేశాడు? చివరకు ఏమైంది? అనేది సినిమా.

**విశ్లేషణ :**

మ్యాక్స్... ఆ టైటిల్కు తగ్గట్టు కిచ్చా సుదీప్ హీరోయిజాన్ని, స్టార్డమ్ను మ్యాగ్జిమమ్ వాడుకోవాలని దర్శకుడు విజయ్ కార్తికేయ ట్రై చేశారు. ఆ ప్రయత్నంలో చాలా వరకు సక్సెస్ అయ్యారు. యాక్షన్ బేస్డ్ కమర్షియల్ ఎంటర్టైనర్ సినిమాను ప్రేక్షకులకు అందించారు.

హీరోల ఇమేజ్ నడిచే కథలు కొన్ని ఉంటాయి. హీరోలకు ఇమేజ్ తీసుకు వచ్చే కథలు ఇంకా కొన్ని ఉంటాయి. 'మ్యాక్స్' మొదటి కేటగిరీకి చెందిన కథ. 'కిచ్చా' సుదీప్ కు ఇప్పుడు కొత్తగా ఇమేజ్ రావాల్సిన అవసరం లేదు. కన్నడ ఇండస్ట్రీలో ఆయన స్టార్ హీరో. ఆయనకు అంటూ ఒక ఇమేజ్ ఉంది. దాన్ని బేస్ చేసుకుని యాక్షన్ ఫిల్మ్ తీశారు దర్శకుడు విజయ్ కార్తికేయ. రాత్రి నుంచి ఉదయం వరకు స్టేషన్ మీదకు వందల మంది రౌడీలు వస్తే... భయపడే స్టాఫ్ అండతో హీరో ఎలా ఎదుర్కొన్నాడు? అనేది క్లుప్తంగా కథ.

యాక్షన్ సీక్వెన్సులకు అవసరమైన సెటప్ కుదిరింది. ప్రొడక్షన్ డిజైన్ అండ్ మ్యూజిక్ కూడా బావుంది. అజనీష్ లోక్నాథ్ పాటల కంటే నేపథ్య సంగీతం ఎక్కువ ఆకట్టుకుంటుంది. కొంత మందికి అది లౌడ్ అనిపించినా సరే... ఆ యాక్షన్ సీన్లలో 'హై' ఇవ్వడానికి అవసరమే. కిచ్చా సుదీప్ ఇమేజ్, అదే విధంగా మాస్ జనాలకు నచ్చే అంశాలను



దృష్టిలో పెట్టుకుని యాక్షన్ బ్లాక్స్ డిజైన్ చేశారు. అయితే... ఈ కథలో మెయిన్ మైనస్ ఏమిటంటే? లోకేష్ కనకరాజ్ ఫ్లేవర్ అండ్ కార్తీ 'ఖైదీ' తరహా కాన్సెప్ట్. సినిమాపై 'ఖైదీ' ప్రభావం ఎక్కువ కనబడుతుంది. కథంతా ఒక్క రాత్రిలో, మేజర్ సీన్స్ స్టేషన్లో జరుగుతాయి. ఈ కథలో యాక్షన్ వచ్చిన ప్రతిసారీ హై వస్తుంది. కొన్ని సీన్స్ వచ్చినప్పుడు డల్ అవుతుంది. మెయిన్ ట్విస్ట్ రివీల్ చేయడం, ఆ తర్వాత ముగింపు ఇవ్వడంలో ఇంకాస్త గ్రిప్పింగ్గా తీస్తే బావుండేది. కథ, కథనాల్లో కొత్తదనం లేకపోవడం ఈ సినిమాకు మరొక మైనస్.

కిచ్చా సుదీప్ నటనకు సవాల్ విసిరే క్యారెక్టర్ కాదు మ్యాక్స్. కానీ, ఆయన స్వాగ్ వల్ల క్యారెక్టర్ బాగా ఎలివేట్ అయింది. యాక్షన్ సీక్వెన్సుల్లో ఆయన మ్యానరిజం అండ్ యాటిట్యూడ్ ఎక్సెలెంట్. మాస్ జనాలను బాగా మెప్పిస్తాయి. సునీల్ మరోసారి మాస్ డాన్ రోల్ చేశారు. నెగిటివ్ షేడ్ ఉన్న పోలీస్ పాత్రలో వరలక్ష్మి స్క్రీన్ ప్రజెన్స్ బావుంది. కథలో కీలకమైన క్యారెక్టర్ చేసిన తమిళ నటుడు ఇళవరసు బ్యాలెన్స్డ్ యాక్టింగ్ చేశారు. మిగతా నటీనటులు ఓకే. ఫిమేల్ పోలీస్ రోల్స్ చేసిన ఇద్దరి నటన కాస్త బోర్డర్ దాటింది.

మాస్ జనాలకు మ్యాగ్జిమమ్ ఎంటర్టైన్మెంట్ ఇచ్చే సినిమా 'మ్యాక్స్'. కథ, స్క్రీన్ ప్లే వంటి అంశాల గురించి ఆలోచిస్తే స్క్రీన్ మీద యాక్షన్ చేసే మేజిక్ ఎంజాయ్ చేయలేరు. రొటీన్ కమర్షియల్ ఫార్మాటులో సాగినప్పటికీ... యాక్షన్ సీన్స్ కిక్ ఇస్తాయి. ఆ తరహా సినిమాలు కోరుకునే ప్రేక్షకులకు 'మ్యాక్స్' నచ్చుతుంది. ఆ విషయంలో నో డౌట్.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత, జ్యోతిష్య చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 29.12.2024 నుంచి 4.1.2025 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరము. ముఖ్యమైన విషయాలలో ప్రయాణాలలో వాయిదాలకి అవకాశం ఉంది. ప్రయాణాలలో చికాకులు, నూతన వ్యక్తుల పరిచయాలు ఇబ్బంది కలిగించినప్పటికీ ఆత్మ బలముతో వాటిని జయిస్తారు. తోబుట్టువులతో ఆత్మీయులతో విభేదాలు రాకుండా వీలైనంతవరకూ మౌనం పాటించటమేలు. ఆకస్మిక ఖర్చులు అధికంగా ఉంటాయి. వారం మధ్యలో భాగస్వామికి ఆరోగ్య పరంగా శ్రద్ధ తీసుకుంటారు. ఆగిన పనులు ముందుకు సాగుతాయి. గురువులని పెద్దలని కలిసి ఆశీర్వచనం తీసుకుంటారు. ఆధ్యాత్మిక క్షేత్ర పర్యటన ఆనందాన్నిస్తుంది. వారం చివరిలో భాగస్వామ్య వ్యాపారాలలో అనుకూలంగా ఉంటుంది. జీవిత భాగస్వామికి వృత్తిపరమైన అభివృద్ధి. కళా రంగంలో ఉండే వారికి అనుకూలంగా ఉంటుంద.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో జీవిత భాగస్వామితో అనుకూలమైన చర్చలు చేస్తారు కుటుంబ వార్తలను ఆహ్లాదకరంగా ఉంటుంది కొత్త నిర్ణయాలు తీసుకుంటారు వ్యక్తిగత శ్రద్ధ, రోగనిరోధక శక్తి పెరుగుతాయి. పాత బాకీలు వసూలు అవుతాయి. పనులలో ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత విభేదాలు రాకుండా సంయమనం పాటించాలి. ఆత్మీయ సోదర వర్గం సహకారం అనుకూలంగా ఉంటుంది. వారం మధ్యలో ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి ఆకస్మిక ఖర్చులు చికాకులు కలిగిస్తాయి. దీర్ఘకాలికి పెట్టుబడులు పైన ఆసక్తి ఉండదు. మాటల విషయంలో కంటి విషయంలో జాగ్రత్తలు అవసరం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడటం వల్ల ఇతరులు అపార్థం చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో సంతానముతో, ఆత్మీయ వ్యక్తుల తో ఆహ్లాదకరంగా గడుపుతారు. రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి. ఉన్నత వ్యక్తులని కలుస్తారు. వారి ఆశీస్సులు తీసుకుంటారు. మీ ఆలోచనలు బాగుంటాయి సృజనాత్మకత బాగుంటుంది. అనుకున్న విషయాలు సత్ఫలితాలు నిస్తాయి. ఇంతకుముందు రుణములు తీసుకున్న వారి చెల్లిస్తారు. వారం మధ్యలో భాగస్వామ్య సంబంధాలు ఇబ్బంది పెట్టకుండా, అపార్థాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వృత్తిపరమైన అంశములలో, సామాజిక సంబంధాలలో వైరాగ్య భావనల అధికంగా ఉంటాయి. వాటిని అధిగమించే ప్రయత్నాలు చేయాలి. భాగస్వామి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

సంవత్సరం ప్రారంభం విందు వినోదాలతో, ఆహ్లాదకరంగా సంతోషంగా స్నేహితులతో బంధుమిత్రులతో ప్రారంభమవుతుంది. గృహ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. సంతాన విద్య అభివృద్ధికి సంబంధించిన విషయాలు వింటారు. ఆలోచనలు ఉద్వేగ పూరితంగా ఉన్నప్పటికీ ఫలవంతంగా ఉంటాయి. ఆకస్మిక బహుమానాలు అందుకుంటారు, భాగస్వామికి సంబంధించి కొత్త నిర్ణయాలు ఆశాజనకంగా ఉంటాయి. వారం మధ్యలో అధిక శ్రమ, నూతన బాధ్యతలు, పోటీలలో విజయం కొరకు చేయి ప్రయత్నాలు, పూర్వ రుణాలు చెల్లిస్తారు, బంధుమిత్రుల రాకతో సందడి వాతావరణం. దీర్ఘకాలిక అనారోగ్యాల నుంచి ఉపశమనం పొందుతారు. మీ కుటుంబములోని పెద్దలు తీర్థయాత్రలు చేయడానికి సంకల్పిస్తారు.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో తల్లి ఆరోగ్య ఆదాయం అభివృద్ధి కరంగా ఉంటుంది. వాహనము కొరకు, గృహ నిర్మాణం కొరకు ప్రయత్నాలు చేస్తారు. విద్యార్థులు విద్యాపరమైన అంశములు మీద శ్రద్ధను పెంచుకోవాలి. వ్యవసాయ అంశములు అనుకూలంగా ఉంటాయి. మిత్రులతో అనుకూ లంగా ఉంటుంది. వృత్తిపరంగా దూర ప్రదేశాలలో తోబుట్టువులకు నూతన అవకాశములు. మీ సహకారం ఉంటుంది వారికి. వారం మధ్యలో స్నేహితులతో అభిప్రాయ బేధం రాకుండా జాగ్రత్త పడాలి. ఎంతోకాలం ఎదురు చూస్తున్న దూర ప్రదేశంలో నుంచి అందుకున్న ఒక వార్త ఆనందాన్నిస్తుంది. విదేశీ ప్రయత్నాలు చేస్తారు. ఉపాసన బలాన్ని పెంచుకోవడానికి చేసే ప్రయత్నాలు కొంతవరకు అనుకూలంగా ఉంటాయి.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో మిత్రుల సహకారం ఆశించిన విధముగా అనుకూలంగా ఉంటుంది ధైర్యము, పరాక్రమం పెరుగుతుంది. నిర్ణయాలు ధైర్యంగా తీసుకుంటారు. ఆదాయము అనుకూలంగా ఉంటుంది. కుటుంబ వాతావరణం సందడిగా ఉంటుంది. దగ్గర ప్రయాణాలు చేస్తారు. వారము మధ్యలో గృహ వాతావరణం, ముఖ్యంగా తల్లి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. విద్యార్థులు విద్య మీద ఆసక్తి పెంచుకోవాలి. గృహ వాహన సంబంధ అంశములలో చిన్న పాటి రిపేర్లకు మరమ్మతులకు అవకాశం. వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉన్నప్పటికీ మీరు సమయానికి మీ పనిచేసే ఉన్నత అధికారుల ప్రశంసలను పొందుతారు. దానివలన వృత్తిపరమైన అలసట, అనారోగ్య భావనలు. సమయానికి విశ్రాంతి ఆహార స్వీకరణ మేలు.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చాలాకాలంగా చూస్తున్న రావలసిన ఆదాయమును అందుకుంటారు. యదార్థవాది బంధు విరోధి అన్నట్లుగా మాట్లాడే మాట నిక్కచ్చిగా ఉండటం వల్ల కొందరు ఇబ్బంది పడే అవకాశం ఉంది. కొన్ని పనులలో ఆటంకాలు ఆలస్యాలు ఉన్నప్పటికీ పట్టుదలగా వెళ్లే ప్రయత్నాలు. మాట విలువ గౌరవం పెరుగుతుంది నూతన వృత్తి కోసం ప్రయత్నం చేసే వారికి చాలా వరకు అనుకూలంగా ఉంటుంది. సంతాన అభివృద్ధి కొరకు కొత్త ప్రయత్నాలు చేస్తారు. వారి కొరకు సమయాన్ని కేటాయిస్తారు. వారం మధ్యలో వ్యక్తుల సహకారం పెరుగుతుంది. నిర్ణయాలు తీసుకుంటారు. వాటిని అమలు చేయడములో చేసే ప్రయత్నాలు అనుకూలం గా ఉంటాయి.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభ ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటుంది. మనసులోని కోరికలన్నీ నెరవేర్చుకోవడానికి కృషి చేస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. శారీరక శ్రద్ధ, అలంకరణమీద ఆసక్తి పెరుగుతాయి. భాగస్వామితో కలిపి నూతన నిర్ణయాలు తీసుకుంటారు. దూర ప్రయాణానికి సంకల్పం చేస్తారు. ఆ కస్మికమైన ఖర్చులు ఉంటాయి. వ్యక్తిగత సంతోషం కొరకు అధికమైనప్పటికీ ఆనందాన్నిస్తాయి. ఇతరులకు రుణములు ఇస్తారు. సంతానపరమైన అంశములలో అభివృద్ధికి సంబంధించిన విషయాలు ఆలోచన రేకెత్తి స్థాయి. గృహ ఆదాయం బాగుంటుంది. తల్లితర బంధువుల నుంచి రాకపోకలుంటాయి. బహుమానములు అందుకుంటారు. నూతన వాహన కొనుగోలు కొరకు తోబుట్టువులతో సంప్రదిస్తారు. వారం మధ్యలో కుటుంబ ఆదాయంలో కొంత ఆటంకాలు ఉంటాయి,



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభం అధిక ఖర్చులతో మొదలైనప్పటికీ అవి ఉపయోగకరంగా ఉంటాయి. ఆత్మసంతృప్తిని వ్యక్తిగత అభివృద్ధిని కలిగిస్తాయి. ఆధ్యాత్మిక ఆలోచనలతో సంవత్సరాన్ని స్వాగతం పలుకుతారు. కుటుంబంలో భాగస్వామితో అన్యోన్యతను పెంచుకోవడానికి ప్రయత్నాలు చేయాలి. మాట పట్టింపులు లేకుండా, వాగ్వాదములకు చోటు ఇవ్వకుండా ముందుకు సాగాలి. కొత్త వ్యక్తుల పరిచయాలు. లాభాలు వచ్చినప్పటికీ వాటిని దుర్వినియోగము కాకుండా అనుకూలం గా మరల్చుకోవడానికి ప్రయత్నములు చేయాలి. వారము మధ్యలో ప్రతి విషయంలోనూ మానసికంగా ఆందోళన, వైరాగ్యంగా ఆలోచనలు ఉన్నప్పటికీ అధిగమించే ప్రయత్నం చేయాలి. సంతానము అభివృద్ధి కొరకు ఆలోచిస్తారు. వ్యవసాయ సంబంధ అంశములు మీద దృష్టి పెడతారు.



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

సంవత్సరం ప్రారంభం సంతోషంగా శుభవార్తలతో వృత్తిపరమైన అభివృద్ధితో, మొదలవుతుంది. కుటుంబ సభ్యులతో సంతానంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో, చిన్ననాటి స్నేహితుల పలకరింపులతో ఉత్సాహంగా గడుస్తుంది. ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తారు. తండ్రి నుంచి, దూర ప్రదేశాల నుంచి విలువైన బహుమానాలు అందుకుంటారు. వృత్తిలో గౌరవం, ఆదాయపరమైన పెరుగుదల, ఆశించిన ప్రదేశములకు స్థానచలనమునకు ప్రయత్నాలు అనుకూలంగా ఉండడం ఆనందాన్ని స్థాయి. వారం మధ్యలో వృత్తిపరంగా నూతన బాధ్యతలు ప్రయాణాలు, కొత్త వ్యక్తుల కలయిక, శ్రమ బడలిక ఉన్నప్పటికీ చలాకీగా వాటిని అధిగమిస్తారు. నూతన విషయాలు తెలుసుకుంటారు. వారం చివరిలో వ్యక్తిగత గౌరవము శ్రద్ధ పెరుగుతాయి



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉంటాయి. గౌరవం పెరుగుతుంది. ఇతరులకు సహకరిస్తారు. వృత్తిపరంగా ఉన్నత అధికారుల సహకారంతో పనులు నెరవేరుస్తారు. నూతన విషయాలు నేర్చుకుంటారు. సమయమునకు తగిన ఆహార స్వీకరణ అవసరము. భూమికి సంబంధించిన అంశములలో కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. తోబుట్టువులతో నిదానమవసరం. నూతన బాధ్యతలు అధికముగా ఉండటం వల్ల ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది పడతారు. వారం మధ్యలో ఒక వార్త ఘర్షణతో కూడిన ఆనందాన్నిస్తుంది. మిత్రులతో సన్నిహితులతో కలిసి చర్చిస్తారు. ఆత్మీయుల సహకారంతో కోరుకున్న విషయంలో పనులు ముందుకు సాగుతాయి. భాగస్వామి సంబంధ అంశాలు ఒక్కలికి వస్తాయి. దగ్గరలో ఉన్న పుణ్యక్షేత్రాన్ని సందర్శిస్తారు.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాబాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభం అధిక ఖర్చులు ఉన్నప్పటికీ, అవి సంతోషాన్ని , ఉపయోగపడ్డాన్ని సూచిస్తున్నాయి. విద్యా పరంగా అభివృద్ధి పరంగా ఉంటుంది. పెద్దలు గురువుల ఆశీస్సులతో ముందుకు సాగుతారు. ఆత్మీయ వ్యక్తుల సహకారం మీకు మనోధీర్యాన్ని ఇస్తుంది. విదేశీ ప్రయత్నం చేయువారికి చాలా వరకు అనుకూలంగా ఉంది. సంతానానికి అభివృద్ధి కరంగా, విదేశీ పరమైన విద్యకి అవకాశంగా సూచనలు ఉన్నాయి. వారం మధ్యలో వృత్తిపరంగా కొంత అధిక శ్రమకు, అపార్థములకు, నూతన బాధ్యతలకు అవకాశము ఉంది. వృత్తిపరమైన వైరాగ్యంతో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. వృత్తిపరముగా సంబంధం లేని వ్యక్తుల విమర్శలు చికాకును కలిగిస్తాయి. వాహనములను నడిపేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.


అపర్ణ రెడ్డి
RAGALAHARI.COM